కథానిక

ఒకపొద్దు పొడిచింది

శ్రీ ఘట్టి కృష్ణమూర్తి

అప్పుడు నాకు మరీ చిన్నతనం కాకపోయినా ప్రపంచాన్ని గురించి అంతగా గుర్తెరగని రోజులవి. మా నాన్న జిల్లా కోర్టులో 'బెంచిక్లర్కు'గా, పనిచేస్తూ వుండేవాడు. ఆయనకు నెలకు వచ్చే జీతం యెంతో నాకు వివరంగా తెలియదు, కాని మా సంసారం బాగానే యే కొదవా లేకుండా జరిగిపోతూ వుండేది.

కొందరు అంటూవుండగా విన్నాను మానాన్న చాలా మందితోపాటే లంచాలు తీసుకొనేవాడని. దానిని గురించిన నిజం నాకిప్పటికీ అర్థం కాదు. ఏరోజు కారోజు రూపాయల దొంతరలు కోటు జేబులోనించి తీసి డ్రాయర్లో దాస్తూ వుండడం మాత్రమే నే నెరుగుదును. కావలసిన అవసరాలు తీర్చుకోవడంతోనే మాకు సరి!

నాకు బాగా గ్రాహికం తెలిసేనాటికి మా అక్కయ్యలిద్దరికి పెండ్లిండ్లయినయ్. నే నెరుగుండగా అయిందల్లా మా మూడో అక్కయ్య పెళ్ళి మాత్రమే. ఇదివరకు నాన్న చేసిన పెళ్ళిళ్ళతో పోల్చి చూస్తే, నాటికిది తక్కువ ఘనంగానే జరిగిందని రెండూ యెరిగున్నవాళ్లు అంటూ వుంటారు.

అప్పటికే మా నాన్నకు పింఛను తీసుకొనే వయసు రావడంవల్ల డబ్బుదగ్గిర కొంత బిగువు చూపించాడంటారు కొందరు. మరి నాలుగేండ్లకల్లా ఆయన పింఛను తీసుకొన్నాడు! నెలకు ముప్పైనో నలభైయ్యో వస్తయ్, అంతే! ఇంక యీ వూళ్ళో వుండడం అనవసరం అనుకొన్నాడు కాబోలు! ఆయన పుట్టిన లంకలో నేవున్న ఒక స్థలంలో యిలు కట్టి కాపరం అక్కడకు తర్లించుకు వెళ్ళాడు. అప్పట్నించీ నేనూ ఆ వూళ్ళోనే వుండిపోయాను.

నాకు ముగ్గురు అక్కయ్యలు, ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్ళు, ఒక అన్నయ్య. మా అన్నయ్య మాత్రం పక్కవూళ్లోనే వున్న హైస్కూలులో చదువుతూ వుండేవాడు. నా చదువు విషయమై అంతగా శ్రద్ధ తీసుకోలేదు మా నాన్న. దానికి తగినట్లుగా మా వూరు 'కృష్ణ'కు ఒడ్డునే వుండడంవల్ల ఏరోజు కారోజు ఏరు దాటిపోయి చదువుకు రావలసిన అగత్యం వుండేది. దానివల్లకూడా నా చదువు సాగలేదు; అయినా చదువను వ్రాయను మాత్రం నేర్చుకొన్నాను.

అప్పటికి యింట్లో వున్న ఆడపిల్లల్లో నేనే పెద్దదాన్నవటంమూలాన మా అమ్మకు చేదోడువాదోడుగా వుండి పనులు చేసుకుపోవడంతోనే సగం పొద్దు గడచిపోయేది. తీరిక సమయాల్లో అర్థంపర్థంలేని ఆటల్లోనూ, కబుర్లతోనూ కాలం గడిపేదానిని. అంతకంటే విశేషించి ప్రపంచజ్ఞానం అలవడగల వాతావరణం అక్కడలేదు.

నాకు పెళ్ళీడు వచ్చింది. మానాన్న సనాతనాచారాల్లో విశ్వాసంకలవాడు కావడంవల్ల, నా కెలాగైనా రజస్వల కాకపూర్వమే పెళ్లి చేసెయ్యాలని శతవిధాల ప్రయత్నించాడు. కాని యెక్కడా కలిసి రాలేదు. దానికి తగినట్లుగా పింఛను పుచ్చుకుంటూ యీ పల్లెటూళ్ళో కాలం గడుపుతున్న ఆయన యిదివరకటి కట్నాలూ, కానుకలూ యివ్వలేడాయె! మరాయన మొర విని నన్ను పెళ్లిచేసుకోవడానికి వొప్పుకోగల త్యాగపురుషుడెవరు? కాళ్ళు బలపాలు కట్టేలా యెన్నాళ్లు తిరిగినా ఆయన అనుకొన్న దేదీ నెరవేరకపోవడంతో కొన్నాళ్ళపాటు ఆప్రయత్నం నించే విరమించుకొన్నాడు!

ఏది యేమైనా కాలచక్రం మహావేగంతో తిరిగిపోతూనే వుంటుందిగా! ఆయన ఆలోచనలన్నీ వొక

తీరానికి రాకుండానే నేను రజస్వలనయ్యాను. ఆ మాట వినడంతోటే మా నాన్న సగం కృంగిపోయాడు.

అయినా, నా సంగతి యెవ్వరికీ తెలీకుండా గుంభనగా అట్టే పెట్టారు. ఎన్నాళ్ళు దాగుతుంది? నోరు ముయ్యగలం కాని, లోకం ముయ్యగలమా? ఆ నోటా, ఆ నోటా అందరికీ తెలిసింది. ఎవరికి తోచినట్టు వాళ్లు వాక్కుంటున్నారు. కాలం గడచిన కొలదీ నామీద ఎన్నో వాడుకలు పుట్టించి చెప్పుకోవడంకూడా విన్నాను. చేసేదిలేక నాలో నేనే కుమిలి ఏడుస్తూ వుండేదానిని. అందులోనూ బొత్తిగా సంస్కారంలేని ఆ మారుమూల లంకల్లో యువతుల బాగోగుల గురించి అంత విమర్శగా ఆలోచించే దెవరు? ఆమాత్రం తీరికా, ఓర్పూ యెవ్వరికేడిసినయ్?— ఇదిగో పులి, అంటే అదుగో తోక, అనే రకం!

ఇలాంటి వ్యవహారాల్లో యే విషయమైనా మరీ తొందరగా పాక్కుతుంది. అంత వేగంగానూ వ్యాపించుతుంది, ఏవేవో మాటలు చెప్పి వారిని వొప్పించడం బహుకష్టం. అలాటి ప్రయత్నం చెయ్యడంకూడా మహాప్రమాదమౌతుంది ఒకోక్కప్పుడు. మన తప్పును మనమే నోరారా, బుద్ధిపూర్వకంగా వొప్పుకొంటున్నట్టు భావిస్తారు. అన్నింటికీ తలవంచుకు తిరగటమే మేలని మా నాన్న యెవ్వరితోనూ కల్పించుకోనే వాడు కాదు.

తెల్లారిలేస్తే అందరితోనూ అవసరాలుంటయ్యాయె! అందరికీ ఆయనతోనూ పనులుండేవి! ముప్పైసంవత్సరాలపాటు కోర్టులో మెలగినవాడు కావడంవల్ల, ఎవరికి యే వ్యవహారం కావాలన్నా, యే కాయితం కరామతులు వ్రాసి పెట్టాలన్నా ఆయన దగ్గిరకేవచ్చి చేరుతూవుండేవాళ్లు. ఆమాత్రం పరపతే లేకపోతే మానాన్న ఆవూళ్లో యెలావుండగలడు?

ఎవరి అవసరాలను వాళ్ళు ఉపయోగించుకోవడమేగాని ఆయనపై యెవరికి సానుభూతివుంటుంది? ఉన్నా చేయగల సహాయంకూడా బహు స్వల్పం. ఇది అంతంతమాత్రాన పరిష్కారమైపోయే సమస్య కాదుగా!

ఒక్క రెక్కమీద సంసారం గడుపుకుంటూ ఇతర వ్యవహారాలన్నీ సరిదిద్దుకుంటూ నా విషయమై అంతగా ఆలోచించడానికిగానీ, 'అయినకాడికి జమాబందీగా వ్యవహారం చేసుకొని రావడానికిగానీ, ఆయన యెంతవరకూ సమర్థించుకురాగలడు?

ఇది యిలా వుండగా గోరుచుట్టుమీద రోకటిపోటులా యెవ్వరో యెక్కణ్ణించో తెచ్చిన వొక వ్యాజ్యంలో చిక్కుకోవడంమూలాన ఆయన మనసుకు అసలే శాంతి లేకుండాపోయింది. ఎవ్వరు ఏమడిగినా చీదరించుకొనేవాడు. మాలాటివాళ్లవిషయమై చెయిచేసుకున్న ఘట్టాలు కూడా కొన్ని వున్నయ్.

అసలే మా నాన్నకు కోప మెక్కువ. అందుకని మా అమ్మకూడా ఆయన యెదుట నిల్చుని నా విషయం ప్రస్తావించడానికి జంకుతూ వుండేది. అక్కడికీ తల్లిప్రాణం వూరుకోక ఒకటి, రెండుసార్లు మా మామయ్యచేత అడిగించింది కూడా. ఆయనకీ మా నాన్నదగ్గిర్నుంచి సరైన సమాధానం అందలేదు. అంతకంటే మేం స్వతంత్రించి సాధించదగినదీ కనబడలేదు. కాలం తీర్పుకై యెదురుచూస్తూ వేచి వున్నాం.

పట్టుమని పదిరోజులైనా గడవకుండానే మా అత్తయ్యకేదో పెద్ద జబ్బుచేసిందని ఉత్తరం రావడంమూలాన అమ్మా, నాన్నా అక్కడకు వెళ్లారు. ఇంక యింట్లో వున్న అందరినీ— పెద్దా, చిన్నా —సాకను రావడం నాపైన బడ్డది. తొమ్మిదింటికల్లా మా అన్నయ్యకు అన్నంపెట్టి టిఫినుకారియరిచ్చి స్కూలుకు పంపాక, మిగిలినవాళ్లతో ప్రొద్దస్తమానమూ సతమతమౌతూ వుండేదానిని. యీ సంసారం యీదే భారం నామీద యెందుకు పడిందో......—భవిష్యత్తులో నాకు కొంత అనుభవాన్ని చేకూర్చిందీ స్వల్ప వ్యవధిలో నేను పడిన ఆరాటం—

మా నాన్న వెళ్ళి వారం రోజులైంది. ఉత్తరం ముక్కైనా వ్రాయలేదు అప్పుడే కాదు; ఉత్తరాలు వ్రాయడం విషయంలో ఆయన యెంత మొండివాడంటే, యీనాటికీ అల్లుళ్లు దెప్పుతూనే వుంటారు! ఏనాటి కానాడు అన్నయ్య ఇంటికి రాగానే అడుగుతూ వుండేవాడు 'నాన్నదగ్గిర్నుంచి ఉత్తరం వచ్చిందా?' అని. రాలేదనే నా సమాధానం విన్నాక వాడు చిరాకుపడుతూ వుండేవాడు.

ఒక శనివారంనాటిమధ్యాహ్నం మాఅన్నయ్య భోజనంచేశాక అత్తయ్యగారి వూరు వెళ్లాలని బయల్దేరాడు. నాన్న ఉత్తరం వ్రాయలేదనే ఆదుర్దాకంటే అత్తయ్య కెలా వున్నదనే దిగులుతోనే మేమందరం

కుమిలిపోతున్నాం—అత్తయ్యదగ్గిర మాకున్న చనువు స్వతంత్రతనూ మా అమ్మదగ్గిరకూడా లేదేమో అనిపిస్తుంది! ఆవిడ గారి చల్లనికళ్లలో అన్నపూర్ణ స్వరూపం ప్రత్యక్షమయ్యేది. ఒకప్పుడు మేం మందరమూ అత్తయ్య ఒడిలో దాగుడుమూత లాడుకొన్న వాళ్లమే. మా యింట్లో యే కార్యం కరామత్తులు జరిగినా మా అత్తయ్య వచ్చి వడ్డించనిదే అది జరిగినట్టే వుండేది కాదు. ఆవిడగారు అన్నంపళ్లెం పట్టుకుని, వీణవాయించినట్లు బంతులవెంట పాటలు పాడుకుంటూ పోతూంటే అది నిజంగా అన్నపూర్ణ చేసిన విందులాగుండేది! నాకు బుద్ధి తెలిసిన తరువాత మా మూడో అక్కయ్య పెళ్లికీ, మా అన్నయ్య నోడుగుకూమాత్రం ఆవిడ వచ్చింది. అయినా సంవత్సరాని కొక్కసారైనా వేసవికాలపు సెలవులలో వచ్చి రెండు వారాలపాటు ఉండిపోతూ నే వుండేది.

ఆవిడకు ఆడసంతానం లేదు. మా అన్నయ్యను చూసినప్పుడెల్లా 'అలుడూ' అని ముచ్చట్లాడుతుండేది. నాకు కూతురు పుడితే తప్పక నీకిచ్చి చేసుకుంటానని మురిసిపోతూ వుండేది. అన్నయ్య అంతకంతకూ పెద్దవాడైనా, ఇంటికి వచ్చినప్పుడు వాడికి తలదువ్వి బొట్టుపెట్టనిదే ఆవిడకు తోచేది కాదు.

అత్తయ్యకు జబ్బుచేసిందని ఉత్తరం వచ్చిన నాడే మా నాన్నతోపాటు వాడూ ప్రయాణం కట్టాడు. అయినా, ఇంటిదగ్గిర పిల్లలు ఒక్కరూ వుంటారని గదమాయించి మా నాన్న వాడిని తీసుకు వెళ్లలేదు. ఆనాటినించి దిగులుపడుతూ నే వున్నాడు వాడు. ఇక మనసు ఉండబట్టలేక మా నాన్న వేయబోయే చీవాట్లకైనా తల ఒగ్గి బయల్దేరాడు.

సంచీ చేతబట్టుకొని గడపలో కొచ్చేసరికి అప్పుడే వచ్చిన మా నాన్న కర్ర మూల్లో పెట్టి చొక్కా విప్పుతూవుండడం యిద్దరమూ చూశాం. మమ్మల్ని చూసినా మాట్లాడకుండా, కొల్లాయి గుడ్డతోపాటు చొక్కాకూడా బుజాన వేసుకుని, నూతివేపుకి నడుస్తున్నాడు మా నాన్న. సంచీ గడప మీద పెట్టి వెంట నడుస్తూ అడిగాడు అన్నయ్య. 'అత్తయ్య కెలా వుంది నాన్నా?' అని. అక్కడనే ఆగి వెనక్కు తిరిగిచూశాడు నాన్న "ఇంకెక్కడి అత్తయ్యరా?" అంటూ అదోలా నిస్పృహగా చెయి విసిరాడు. అన్నయ్య పెదగాలరిచి అక్కడే కుప్పలా కూలబడిపోయాడు, నేను గుమ్మానికి చేరగిలబడ్డాను—

ఈ సంఘటన మా సంసారంలో.—ముఖ్యంగా నా జీవితంలో గొప్ప మార్పుకు కారణమైంది—

ఎలాగో ఆరు నెల్లు దొర్లిపోయినై. ఒకనాటి రాత్రి భోజనాలయాక మేమందరమూ పడుకునివున్న సమయంలో అమ్మా, నాన్నా వొక విషయాన్ని గురించి ఘర్షణపడుతూవుండడం విన్నాను నేను. కేవలం బతిమాలుకుంటున్న ధోరణిలో సాయిలా పాయిలాగ చెబుతూన్నది అమ్మ; నాన్న చీటికీ మాటికీ కసిరి కొడుతున్నాడు.

"నువ్వామాట అన్నావంటే పరువు దక్కదు జాగ్రత!"

"నా అంతట నేను అంటున్నానా? వాడు నోరు చేసుకు అడిగించాడుగదా, అదేదో విచారించాల్సిన భారం మనమీదకూడా వున్నదంటారా లేదా?"

"నా మీద యేమీ లేదు, నేను చేతులారా దాని గొంతుకొయ్యను. అయిననాటికే అవుతుంది, ఆ పాచిమాట రాకుండా చేదామనుకొన్నాను, వచ్చింది రానే వచ్చింది చూస్తూ చూస్తూ నా అంతి వాడికిచ్చి కడతానా?"

"వాడి విషయం వొచ్చేసరికి అంతిలూ, ఇంతలూను. మీ మానానికి మీరేం జేశారు చెవుదురూ?"

"అదంతా నీకనవసరం. నా కప్పటికి పిల్లలు లేరు. నీ అన్నకు ఐదుగురు మొగపిల్లలు!"

"అందుకనే, కాచిపోసే దిక్కైనా లేరనేగా వాడూ అడుగుతున్నాడు! చేతికెదిగిన ఆడపిల్లవుంటే వాడింత బిగలా పడేవాడే కాదు. అయినవాళ్ళు వున్నందుకు అవసరానికి ఆదుకుంటే..."

"అది నావల్ల కాదుగానీ, నువ్వు అనవసరపు వ్యవహారం నెత్తికి తెచ్చుకోకు, నోరు జారావంటే నీ పరువూ, నా పరువూకూడా దక్కదు"—ఈ తీరుగా జరిగింది వారి సంభాషణ. విదిలించుకొన్నట్లుగా చరాల్న సావిట్లోకి వచ్చాడు నాన్న.

అంతకు ముందునించే మంచంమీద కూర్చుని వింటూన్న నాకు గుండెల్లో గతుక్కుమన్నట్లయింది. నావంక ఒక్కసారి తీవ్రంగా చూసి వాకిట్లోకి నడిచాడాయన. నేను కుక్కిన పేనులా తిరిగి మంచం మీద వాలిపోయాను.

అప్పటికి నా కింకా పసితనమే! జరిగిందేదో విచారించుకుని ఖచ్చితమైన నిర్ణయాలు చేసుకోగల

తాహతు నాకు లేదు. అయినా మనసులో వొక విషమైన గుబులు బయల్దేరింది. వెన్నున అదురుగా చలి వచ్చినట్లయింది దుప్పటీ ముసుగు పెట్టి నా అంతట నేనే వణికిపోవడం మొదలు పెట్టాను. అమ్మను పిలవడానికి గొంతు పెగలలేదు. మరేం జెయ్యాలో కూడా నాకు పాలుపోలేదు.

అప్పటి నా వూహలూ తలంపులూ అన్నీ యేకరువు పెట్టలేను కాని వొక్కటిమాత్రం ఇప్పటికీ నా కళ్లకు కట్టినట్లుంటుంది-- నే నప్పుడు ముసుగుతన్ని కన్ను మూశానో లేదో...మా అత్తయ్య యెదురుగుండా నిల్చుని ఓక్క మొహంతో నాకేదో చెప్పొచ్చినట్లయింది.

“ఏమిటత్తయ్యా?” అని నే నడిగాను. “ఏముంది తల్లీ! మామయ్య కులాసాగా వున్నారు కాదూ, శాస్త్రి ఆడుకొంటున్నాడా? (శాస్త్రి మా అత్తయ్య పెద్ద కొడుకు) అమ్మ చెప్పేవమాటలు వినకేం? నీ యిష్టం ప్రకారమే చేసుకో! నాన్న నీకేదో చెప్పాలనుకుంటున్నారు, విను! విను!!” అంటూ కొంగు చాటు చేసుకుని వలవలా యేడ్చింది వెన్నున చరచినట్లయి ఉలిక్కిపడి లేచాను. ఆ రోదనధ్వని యిప్పటికీ నా చెవులకు వినిపించుతూనే వుంటుంది. నా చుట్టూ ఏమీ లేదు. మా అన్నయ్యా, చెల్లెలూ తమ్ముడూ అందరూ వొళ్లెరగకుండా నిదురబోతున్నారు.

అత్తయ్య చెప్పిన మాటలకు అర్థమేమిటో అప్పట్లో నేను ఊహించుకోలేకపోయాను. ఆ క్షణం నించి యెంతో సేపటివరకూ నా కంటిమీద కునుకు పడలేదు——అమ్మ నాన్నను అడగటం, అత్తయ్య కనబడి అమ్మమాట వినవద్దనడం యీ క్రమమంతా యేమిటో——వాళ్ల సంభాషణలోగల అర్థం పూర్తిగా తెలుసుకొన్నా నేమో...అది నా రాబోవు జీవితం గురించేనని నిర్ణయించుకొన్నాను. నాగురించి తల్లిదండ్రులు అలా మథనపడుతున్నందుకు నాకు తెలియకుండానే, విచారం దుఃఖం పొర్లుకొచ్చినయ్. ఎంతో సేపు నిశ్శబ్దంగా కుమిలి యేడ్చాను.

తెల్లారాక అమ్మగానీ, నాన్నగానీ నాకా విషయం గురించి చెప్పనేలేదు. కాని, యే క్షణానికా క్షణం అత్తయ్య కనులయెదుట మెదులుతూ వున్నట్టే వుండేది——కాని చిత్రమేమిటంటే ఇది జరిగిన పదిహేను రోజుల్లో నే మా బంధువుల్లోను, చుట్టుపట్లా నా గురించిన అపవాదొకటి వినవచ్చింది అది అపవాదేనని నే నీనాటికీ అంటాను. అదేమిటంటే:

నన్ను మామయ్యకిచ్చి పెళ్లి చేస్తానని మా నాన్న బలవంతం చేసినట్టు, నే నందుకు వొప్పుకోక, పైగా పట్టుదల కంతపనీ చేసి తీరినట్లయితే ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటానని నే నన్నట్లూను——ఇది యెంత తీవ్రంగా వ్యాపించిందంటే మాకు అరవై మైళ్ల దూరంలో వున్న మా చిన్నఅక్కయ్య నాన్న కొక ఉత్తరం వ్రాస్తూ, లక్ష్మిని మామయ్యకిచ్చినట్లైతే తనను చంపుకున్నంతవొట్టేనని గట్టిగా హెచ్చరించింది. ఆ కవరులోనే నా పేరున ఒక ఉత్తరం వ్రాస్తూ 'నాన్న చెప్పేమాటలకు ససేమీ ఒపెబడవద్దనీ, అంతగా ఆయన నీగొంతుకు ఉరిపోయదలిస్తే అబ్బాయిని వెంటపెట్టుకుని తనదగ్గిరకి వచ్చెయ్యమని వ్రాసింది.

ఇంక నే నేమనుకోవాలి? ఏపాపమూ యెరగని నామీద యిట్టివాడుక లెలా పుట్టినయ్? ఎవరిద్వారా వ్యాపించినయ్? నా ప్రశ్నలకు సమాధానమే దొరకదు!

ఏది యేలాగున్నా, అమాయికంగా నిమ్మకి నీరెత్తినట్లు బ్రతికే నాలో అర్థం లేని ఆందోళనవొకటి బయల్దేరింది. ఎవరిగడపలోకివెళ్లినా నన్ను వెక్కిరించినట్లు మాటాడేవాళ్లే! చీటికి మాటికీ యేదో వొకమాట సందునపెట్టి దెప్పి పొడిచేవాళ్లే!! మరి నేను మనసు విప్పి యెవ్వరితో మాట్లాడాలి? అమ్మకూడా ఆనాటి నించి ముభావంగానే వుంటున్నది. నాన్నను చూస్తే నాకు మొదట్నించీ హడలేకదా!

ఒంటరిగాకూర్చొని యేదైనా పని చేసుకొందామనుకున్నా, లేక చదువుకొందామన్నా అంతటి స్వతంత్రమూ, చనువూ యెక్కడేడిసినయ్? అదీకాక యిలాంటి గజిబిజీలో వొంటరితనం నా కింతకంటే భయంకరమనిపించేది. చదువుకొని వూరడిల్లడమనేది ఆనాటికి నాకుగల జ్ఞానానికి సాధ్యమయ్యేది కాదుగదా! మరేం జెయ్యాలి? ఇంటా బయటా నాకు సుముఖమైన వాతావరణం కనిపించలేదు. ఎదటి అమ్మాయి ఏమి బాధ పడుతుందోనని విచారించేవాళ్లు మా యిరుగుపొరుగాడవాళ్లలో లేకపోవడం విచారకరం! అందరూ షామేదాలే! ఎవరికి వారొక రాజ్యాన్ని యేలగలిగినంతటి ధీమాగా మాట్లాడుతారు. ఒకొక్కప్పుడు కచ్చగా యేడ్చేదానిని. బైటకా చిహ్నాలుకూడా కనబడకుండా వుండాలని నేను పడినపాట్లు అన్నీ యిన్నీ కావు. ఇది జరిగిన వారం, పదిరోజులకల్లా గోరుచుట్టుమీద రోకటి పోటులా మరో మిడిమేళం వచ్చిపడింది——

మామయ్యగారి వూరినించి అమ్మమ్మ వచ్చి నాన్నతో యీ విషయమే ప్రస్తావించేసరికి ఆయనకు మరీ వుండు రేగినట్లయింది. ఇంట్లో వున్న అందరూ వింటూవుండగానే చీదరించుకు మాట్లాడాడు. అమ్మమ్మకు ఆయన చెప్పిన సమాధానం కసిరి కొట్టినట్టే వున్నది అచ్చంగా. మా అమ్మకూడా ఆ క్షణాన నోరెత్తలేదు. అయినా ఆవిడ పట్టువీడలేదు. ఎలాగైనా వచ్చినపని చేసుకుపోవాలనే బింకం మీదనే వున్నది. సంవత్సరకాలం దగ్గిరపడుతున్నది, రెండోయేడు అడుగుపెడితే పెళ్ళిమాట తలపకూడదని ఆవిడ తహతహ! నాన్న చెప్పిన సమాధానానికి యెదురు చెప్పకుండానే నా అంగీకారంతో తన నిర్ణయానికి కొంత బలం సంపాదించాలని, ఆనాటి సాయంత్రం మెల్లగా నన్ను చేరబిల్చి తల దువ్వుతూ, తన మనసులో వున్న క్షోభనంతా వెళ్ళగక్కింది—

ఏ విధానైనా మామయ్య సంసారం పచ్చగా వుండాలంటే అది నా వల్లనే సాధ్యమని ఆవిడ చెప్పినమాటల్లోని సారాంశం. లోగడ నాపై వచ్చిన అపవాదు సంగతి చెప్పి అది యెవరో గిట్టనివాళ్ళ కుత్సితాలవల్లనే పాకిపోయిందనీ, తమ కేపాపమూ తెలియదనీ, మామయ్యకూడా యెంతగానో నొచ్చుకొన్నాడనీ— ఇదంతా నన్ను వొప్పించడానికే అన్నట్లు నా కళ్ళముందరే వలవలా యేడ్చింది. ఏది యేమైనా చివరకు తా నాశించిన ఫలితం నా దగ్గిర పొందలేకనే పోయింది. ఏమాటకూ నేను సమాధానం చెప్పక కళ్ళప్పగించి వూరుకొన్నాను. —ఆనాడు అత్తయ్య నాయెదుట నిల్చున్నప్పటి బిక్క మొహం నా కళ్ళల్లో మెదుల్తూనే వున్నది.

నేను సమాధాన మీయకపోవడం, లోపలవున్న యేదో కక్షను అంటిపెట్టుకుని కసిగా మొండి చరిచినట్లు అర్థంచేసుకుని వుంటుందావిడ—అమ్మకుకూడా నా వైఖరి యిష్టం లేకపోయిందని ఆవిడలోని ముఖభావం వల్లనే అర్థంచేసుకొన్నాను. మొన్నాడు పొద్దున్న కొంగు దులుపుకొని వెళ్ళిపోయింది అమ్మమ్మ.

నాన్న నిద్దరనుండి లేవనట్లుగానే యెంచి అమ్మతో మాత్రం చెప్పివెళ్ళిపోయిందావిడ. సంగతంతా తెల్సుకున్న నాన్నకు అది మరింత కోపకారణమైంది. ఎన్నోవిధాల అమ్మను దూషించాడు కూడా. తిరిగి అమ్మమ్మను గడప తొక్కనీయనన్నంత కఠినంగా ప్రతిజ్ఞ చేసినట్లే వినిపించినయ్ ఆయన మాటలు—కంటబడిన అందరితోనూ నాన్న విషయం వివరంగా చెప్పివెళ్లింది అమ్మమ్మ. ఇది, నాన్నను గురించి, ముఖ్యంగా నన్ను గురించి యాగీచెయ్యడం కాక మరేమిటి? ఇది విన్నాక నాన్న మరింత రెచ్చిపోయాడు. ఇంత చిన్న విషయాన్ని గురించి—వాళ్ళ దృష్టిలో పెద్దదే కావచ్చు—ఇంత నిర్మొహమాటంగా, కచ్చగా మానవత్వన్నే మరిచి మాట్లాడుకొంటారని, వాదులాడుకొంటారని నా పసి మనసుకి ఏమర్థమవుతుంది? కాగల దానికంతకీ కళ్ళప్పగించి వూరుకోవడం మినహా నాకేవీ తోచలేదు.

పదిహేను రోజులు పదిలంగానే గడిచిపోయినయ్. తలవని తలంపుగా మా చిన్నక్కయ్యా, బావా దిగారు. దానిని చూడగానే నాకూ ప్రాణం లేచివచ్చినట్లయింది. అందుకు కారణంకూడా లేకపోలేదు. మా చిన్నక్కయ్య అంటే మా అందరిలోకంటే మా నాన్నకు చాలా యిష్టం. దాని మాట అంటే ఆయనకు గుండెకాయ. దానికీ తగిన చనువూ, స్వతంత్రమూ వున్నయ్ ఆయనదగ్గిర. ఎదుటబడి ఖచ్చితంగా తెగించి మాట్లాడగలదు. దానిని వదిలించుకోడానికి అమ్మా, తల్లీ, అని బ్రతిమాలుకుంటాడు గాని కసిరికొట్టడు నాన్న. మా అందరిలోకీ చదువుకొన్నది కూడా అదే. హిందీ విశారద ప్యాసయింది. మా బావ కూడా బి.ఏ బి.ఇడి. వాళ్ల దాంపత్యం చూసే మా నాన్నకు బహుముచ్చట. మా అన్నయ్యనుకూడా మాటవరసకి తిడుతూ వుండేవాడు 'చిన్నబావని చూసైనా బుద్ధికలిగి చదువుకోరా' అని.

వచ్చీరాగానే మేమంతా వాళ్ల చుట్టూ మూగాం. మామూలు తరహాలోనే మా బావ నాతో కొంతసేపు సరసాలాడాడు. నేనంటే ఆయనకు అలుసెక్కువ. నావి రెండూ మెల్లకళ్ళు కావడంవల్ల ఆయనవంక చూసి మాట్లాడుతున్నా చూడడంలేదనే దబాయిస్తాడు!

సరే, అక్కయ్యా అమ్మా మామూలుగానే మాట్లాడుకున్నారు. ఏ సందువాళీనైనా నా ప్రస్తావన వస్తుందేమోనని వెనక వెనకే తిరుగుతున్నాను—

మధ్యాహ్నం భోజనాలయ్యాక అక్కయ్య వచ్చి మెల్లగా అంటించింది నాన్నకు. అంతటతో అమ్మకూడా వచ్చింది. అందరూ కలిసి మొదట్నించీ నేను చెప్పిన రగడ అంతా జరిపారు. వీళ్ళలో మాట్లాడకుండా వున్నవాడల్లా బావ వొక్కడే. అవుననీ, కాదనీ చెప్పడు. అన్నీ ఆకళించుకొని వూరుకోవడమే ఆయన పని.

చివరకు నాన్న తేల్చిన సారాంశం యిది—
"నేను చచ్చినా యీ సంబంధానికి వొప్పుకోను. మీ

అమ్మకుమాత్రం బుద్ధిచెప్పి వెళ్లు!" అన్నాడు, అక్కయ్యతో. ఏవీ అనలేక అమ్మకు కళ్లనీళ్లి పర్యంతమయింది.

"అంతా వద్దంటే నేనేనా పట్టుకు పాకులాడేది? తల్లీ తోడూ కనక ఆమాత్రం అనుకోవడం కూడా తప్పేనా యేమిటి?" అంటూ ఆవిడ నిరాశగా అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

ఆనాటి సాయంత్రమే మేమందరం కలిసి కృష్ణ వొడ్డుకు షికారు వెళ్ళాం. అన్నయ్యా, బావా రేవు దాటి అవతలగట్టుకు వెళ్లారు. అక్కయ్య నన్ను దగ్గరకు పిల్చి జరిగిన సంగతేమిటని అడిగింది. నే చెప్పిందంతా విన్నాక, అయినా మామయ్యను చేసుకోవడం నీ కిష్టమేనా? అని సూటిగా అడిగింది. ఇష్టం లేదన్నాను. అత్తయ్య కన్పించిన సంగతి చెప్పాను. అత్తయ్య పేరెత్తేసరికి దానికీ కళ్ళల్లో నీళ్ళు తిరిగినయ్, ఇలా అన్నది—

"ఎందుకనో నాకూ యిష్టంలేదే! గంపెడు సంసారం యెలా దిద్దుకుంటాడో మామయ్య పాపం!" అంటూ కొంతసేపు జాలిపడింది.

"బావ యేమంటాడు?" అనడిగాను.

"ఆయనమాత్రం యేం జెపుతారు? అయినా, నాన్న సంగతి తెలిసినవాళ్లెవ్వరు మాత్రం సాహసించి సలహా యిస్తారు? ఒకటే, రెండుసార్లు నాతోనే అన్నారు, నీకు చెప్పిన సమాధానమే ఆయనకూ చెప్పాను. అదలా వుండనియ్యి! ఇప్పుడు మరో సంగతి నాన్నతో మాట్లాడాలని వచ్చాను. అయినా ఏలూరు సంబంధం వచ్చినప్పుడు ఆయన యెందుకు కాదనాలి?" అంటూ నావంక చూసింది అక్కయ్య.

"ఆస్తిపాస్తులు అంతగా లేవని; పెళ్లి చెయ్యాల్సిన ఆడపిల్లలు ఇంకా నలుగురు ఉన్నారట!" అని నేను విన్నది చెప్పాను.

"ఆస్తులు యెక్కణ్ణించి వస్తయ్? మనకేమో మొత్తలేవను. అన్ని లక్షణాలూ కలిసిరావాలంటే యెలా కుదురుతుంది? ఈ కొడుకు పెద్దవాడనీ, ఆయన పైకివచ్చి చెల్లెళ్ళకు పెళ్లి చెయ్యాలిసి వస్తుందనేగా యీ ఆయన వ్యూహం? ఈయన అచ్చంగా కోర్టువ్యవహారంలా ఆలోచిస్తాడు! సాఫీగా విచారించడు, సాయిలా పాయిలాగా జరిపించుకోని పోడు. వట్టి మొరటు మనిషి!" అన్నది మా అక్కయ్య ఏదో ఆలోచిస్తున్నట్టు.

"అయితే నన్నిప్పు డేం జెయ్యమంటావు?" అనడిగాను.

"నువ్వు చేసే దేమున్నది? ఇది అంతంతమాత్రాన తేలిపోయేదైతే యెవ్వరేం జేసినా సరిపోతుంది కాని..." అంటూ మాట సగంలోనే పూరుకొన్నది అక్కయ్య.

"మరేమౌతుంది?" అన్నటు దాని మొహంలోకి ఆదుర్దాగా చూశాను నన్నా ప్రశ్నించి మరలించి, పూరుకోబెట్టాలనే తలంపు దానికి లేకపోయినా, నేనడిగినదానికి కొంత చిరాకు పడినట్టు కనబడింది. పైకి ఏమీ అనలేక మౌనంగా వున్నట్టు తోచింది నాకు. అంతకంటే నిర్బంధించి అడగ సాహసించలేక పోయాను. అసలు సమస్య నెలా గెత్తుకోవాలో నాకూ అర్థం కాలేదు.

మా సంసారాని కింత గండకతెరగా పరిణమించిన నా పెళ్లిసమస్యయేనా దీనికంతకీ కారణం? ఎవరెన్ని విధాల ఆలోచించినా, తర్కించినా అది మరింత విషమమౌతున్నదే కాని, యెక్కడికక్కడ అడ్డంకులు తీర్చుకుని ముందుకు సాగిపోవడం లేదు. పట్టుదలలు పెరుగుతున్నయ్, ఎవరికి వారు ఏదో తన్నీ తలకెత్తినట్టు యెదటివారితో మాట్లాడుతూ వుంటారు. ఇదికూడా నాన్నకు నచ్చజెప్ప యత్నించకపోతే మరెందుకు వచ్చినట్టు? మామయ్యమీద మరి నాలుగు మాటలు ఆయనచేత అనిపించడానికేనా? అది కానే కాదు. ఆయన మొరటు మనిషి అని, సాఫీగా సంసారపక్షంగా ఆలోచించి చేయడని, ఇప్పుడేగా అన్నది? మొత్తానికి దీనిమనసులో యేదో వున్నది, అది నా చెవిని వేస్తే కొంత ఊరట కల్గుతుంది కదా! ఏమైనా దానంతట అది చెప్పకపోతే నేను మాట్లాడించ కూడదన్న నిర్ణయానికి వచ్చాను. మరొక వేపుకి తిరిగి చుట్టూవున్న ప్రకృతి శోభ పరికించ మొదలు పెట్టాను.

ఇంకా పొద్దుగూకడానికి ఆట్టే కాలం లేదు. ఏటి వొడ్డునవున్న నాకా క్షణం యెంతో హాయిగా వున్నది. మా అక్కయ్యకూడా సన్నని యేటిపాయలోకి దీక్షగా చూస్తున్నట్టు కనబడింది. మావూరికి అదొక్కటే అందం. ఎప్పుడైనా మనసు బాగుండనప్పుడు అక్కడకు వెళితే కాలం యిట్టే గడిచిపోతుంది. కాని ఇంతకాలంగా అక్కడ వుంటున్న నాకు, ఆ సంగతి అనుభవానికి రాలేదు. అయినా అంతటి సాహసం నాకేది? ఈనాడు అక్కయ్యతో యిక్కడకు రావడం వొక కొత్తిలోకంలోకే వెళ్లినట్లయింది.

నేనూ అటు కేసి చూస్తున్నాను, కాళ్ళక్రింద యిసుక గుంటలు తవ్వుతున్నాను. ఆ దిక్కున గెలు దుబ్బులలోనించి గుంపులు గుంపులుగా బాగులుతీర్చి యేటిమీదుగా యెగిరిపోతున్నై కొంగలు; చిన్నతనం స్ఫురణకు వచ్చింది. ఏనాడో యీ అక్కయ్య మా చెల్లెలి నెత్తుకుని 'కొంగ కొంగ గోల్లా' పాట పాడుతూ లాలించి ఆడించడం యెరుగుదును. ఆనాటి అమాయికపు దశే నాకు నెమరుకు రాసాగింది. ఈనాడు ఆ అక్కయ్య వొడిలో కూర్చుని వొక పెద్దజీవిత సమస్య నెదుర్కొంటున్నాను; అప్పటి నా భావం యీనాటికీ మనసులో ముద్రవేసినట్టుంటుంది! ఇద్దరి మనసులూ కొన్ని నిముషాలపాటైనా, అన్యాక్రాంతాలై ఉండివుంటయ్!

సరిగ్గా ఆ సమయానికే పచ్చిమెరపతోటల్లోనించి ఇళ్లకుపోతున్న కొందరు కూలెతలు మా దిక్కుగా రావడం చూశాను. వాళ్లు రోజూ అటు పోతూనే వుంటారు; మెరపపళ్ళుకోసి కళ్లాల్లో కుప్పలుగా పోస్తూవుంటారు. చిన్న చిన్న బుట్టలు బుజాన పెట్టుకుని వయ్యారంగా యేటిఒడ్డు వెంట నడిచివస్తున్నారు. ఒకళ్ల మొహంలోనూ వీసమెత్తు విచారం కనబడదు, ఒకరితో వొకరు సరసాలాడుకుంటూ కేరింతలు కొడుతున్నారు. అక్కయ్య ఆలోచిస్తున్నట్టే వున్నది. నేను ప్రక్కకు తిరిగి వాళ్ళవంకే చూస్తున్నాను.

మేమిద్దరం యిలా యిసుకలో చతికిలబడి కూచోవడం వాళ్ళకు వింతగా తోచిందేమో... మమ్మల్ని గురించే మాట్లాడుకొంటున్నారా? కాని వివరాలకోసం చెవులు రిక్కించలేదు. వాళ్లలో కొందరు నన్నెరిగున్నవాళ్లే! బహుశా నాగురించి కాదుగదా వాళ్ళ మాటలు? వొక్రమానికి వాళ్లలోనించి వొక వ్యక్తి మాకు దగ్గరగా వచ్చి "ఇక్కడ కూకున్నారేం సిట్టెమ్మగోరూ?" అని అడిగింది. నేను ఉలిక్కిపడి ప్రక్కకు తిరిగిచూడడం, నాతోపాటే అక్కయ్యకూడా ఆలోచనలనించి బయటపడడం జరిగినయ్. ఆ మనిషి పేరు మాలక్ష్మి. మా యింట్లో అప్పుడప్పుడూ పనిపాటలు చేసిపెడుతూనే వుంటుంది. మా సంసారంగురించి చాల సంగతులు దానికి తెలుసు. అక్కయ్యనుకూడా యెరిగివున్నదే. అది మా యెదట కూర్చొని మాట్లాడుతున్నంతసేపూ అక్కయ్యే యెక్కువ పాత్ర నిర్వహించింది. పిచ్చాపాటీ అయిన తరవాత నా పెళ్లి వ్యవహారంలోకి దిగారు. అదేవో అడగడం, అక్కయ్య సమాధానాలీయడం జరిగిపోయింది. నాకిదంతా చిరాకనిపించి వొకపెడగా తిరిగి కూర్చున్నాను. దేనికీ స్వతంత్రించి స్వంత అభిప్రాయంగా సమాధానం చెప్పలేదు అక్కయ్య. ఏదో వొక నెపం నాన్నమీదనో, మరెవ్వరిమీదనో మోపుతూనే వున్నది—'ఇంతకీ ఆ ఘడియ రాలేదని, పెదవి విరిచి వూరుకొన్నది మాలక్ష్మి. అంతే నన్నట్టు వంతపలికింది అక్కయ్య. మరి నా ప్రశ్న అలాగే మిగిలిపోయింది?

మనసు విప్పి అక్కయ్యతో మాట్లాడుకొనే అవకాశం కలగలేదు. మూడో వ్యక్తి దగ్గర వున్నప్పుడు స్వేచ్ఛగా అడిగి తెలుసుకోవడం సాధ్యం కాదుగా! నాకేమీ పాలుపోలేదు. మధ్య ఇదెందుకు రావాలన్నట్టు మాలక్ష్మివంక కొరకొరా చూశాను.

'బావ ఇంకా రాలేదే!' అని నాతో అన్నది అక్కయ్య. 'బాబుగారుకూడా వచ్చారా?' అంటూ ఆశ్చర్యంగా చూసింది మాలక్ష్మి. అవు నన్నది అక్కయ్య. 'అయితే నేనూ వారిని చూడాలి' అంటూ అక్కడే మకాం వేసింది మాలక్ష్మి. నా పని మరీ ఇరకాటాన బడింది. ఆయన్ను చూడాలని దాని కింత ఆరాట మెందుకో!

అది వొక్కర్తే కాదు; మా చిన్నక్కయ్యా, బావా వొచ్చారంటే యెందరో వేలంవెర్రిగా వాళ్లను చూడడానికి వస్తూవుండేవారు. నా దృష్టిలో ఆయన మామూలు బావే కావొచ్చు. కాని దానిని యెలా అక్కణ్ణించి పంపివేయడం? అక్కయ్య అందుకు కాదనక దానితో కబుర్లు మొదలెట్టింది. మరి నా సంగతో...పిల్లికి చెలగాటము, ఎలుకకు ప్రాణసంకటమూను. కొంచు దులుపుకొని అక్కణ్ణించి లేచిపోదామా అన్నంత కసిపుట్టి గొంతుదాకా వుక్కిలింతలయ్యింది నాకు. ఆపని చేసే శక్తి లేకపోయింది!

నే నల్లా అక్కయ్యచెప్పే అభిప్రాయానికై ఆశపడి వెళ్ళాను. మరి యీ అవాంతరం యెందుకు వచ్చినట్టు? ఇంతమాత్రానికే వొక దారీ, తెన్నూ తెలియని నా స్వార్థాన్ని పురస్కరించుకొని పాపం! మా లక్ష్మి సాధుస్వభావాన్ని శంకించానా, అనిపించింది. ఇంతలోనే యేటి అవతల గట్టుమీదుగా అన్నయ్యా బావా వస్తున్నట్టు చూశాము. మేమూ వాళ్లు దిగివచ్చే రేవుకు తిన్నగా నడిచాము. వేసవి కాలంలో మావూరిదగ్గిర రేవు పాటగారినప్పుడు దిగి వెళ్లడం అలవాటు.

ఆ రాత్రికి అక్కయ్య నాన్నతో యీ సంగతే చెప్పేసరికి ఆయనకు అత్తిరువులో కారం కలిపి రాచి

నట్లయింది. దాని మనసులోవున్న దేమిటో ఖండితంగా చెప్పివెయ్యదు. మాటిమాటికీ ఆయనను రెట్టించి అడగడంలో అర్థమేమిటి? ఇన్నాళ్ళుగా ఆయనతో నిర్భయంగా మాటాడ నేర్చినది యీనాడు ఇలా మొండిబరిచి వూరుకోవడంలో అర్థం యేమై వుంటుంది? నన్ను పురస్కరించుకొని నాన్నతో తలపట్లు పట్టడం యిష్టంలేకనా? లేక తాను స్వతంత్రించి నాకై వొక వ్యక్తిని నిర్దేశించితే రాగల ఫలితానికి తనూ బాధ్యురాలు కావలసివుంటుందనే జంకు వల్లనా?—అప్పట్లో నాకీ చివరిమాటే సముచితంగా తోచింది. కాకపోతే వొక్క తల్లి కడుపున పుట్టిన నన్ను గురించి ముభావంగా వూరుకోవడంలోని ఆంతర్యం యేమిటి? లేకపోతే అది నాపై చూపిన నిర్లక్ష్యాన్ని యేమని వ్యాఖ్యానించుకోవాలి?

జీవితంలో కష్టసుఖాలనేవి సంభవిస్తూ వుంటాయని వినడమే గాని, అవి యెలా సంభవిస్తాయో నాకంతగా తెలీదు. అయితే నా జీవిత విధానంమీద, లేక నాకు కాబోయే పెండ్లిపైన అవి రెండూ ఆధారపడి వుంటయ్యని తెలుసుకోలేకపోయాను. అక్కయ్యకు తెలీదని యెలా అనగలను?

ఒకరి కష్టసుఖాలు నిర్ణయించవలసిన సమయం వచ్చినప్పుడు యెదటివాళ్ళెంతటి పూనికతో పని చేయగలరో... లేక స్వార్థం వదులుకొని నిర్ణయాలు చేయగలరో అనేదకూడా నాకు కొత్తవిషయమే. అప్పుడప్పుడూ నాన్న, యీ సంబంధం చేసుకొని జీవితంలో అదేం సుఖపడుతుంది? అని అమ్మను రెట్టించి అడుగుతూ వుండడం విన్నాను. ఇది ఆయనకు పరిపాటి అయిపోయింది. అక్కయ్యకూడా మొదటిరోజున ఆయనతో వాదించినప్పుడు అలాటి వైఖరినే అవలంబించింది. కనక నేను సుఖంగా బ్రతకగలగాలీ అంటే వీరంతా నాకై నిర్ణయించే సంబంధంపైన ఆధారపడి వుందన్నమాట! అందుకనే అక్కయ్యను మరీమరీ అడిగాను. అది సాఫీగా సమాధానమిచ్చి తప్పుకున్నా, గోడమీది పిల్లివాటంగా వుండేది. కాని చివరకు మొండిబరిచి నాకు ఉచ్చు బిగించింది!

ఇంట్లో ఇంతమందిలో తిరుగుతున్నా ఆ క్షణంలో ఆసహాయనైపోయినట్టు తోచింద చాటునా, మాటునా గుడ్డు విప్పితే కుంచెడు నీళ్లుగా యేడ్చాను. అక్కయ్యా అమ్మా తిండికి కూర్చున్నప్పుడు వాళ్ళతో పాటు ఉండడానికి నాకు మొహం చెల్లలేదు. పిడ్డతప్పు చేసినదానిలా వొదిగి, వొదిగి తిరిగాను. 'ఇప్పుడిది యెందుకు రావాలి?' అని కచ్చిగా నన్ను నేనే లెక్కలేనన్నిసార్లు ప్రశ్నించుకున్నాను. రాత్రల్లా నాకు తెలియకుండా యెంత కన్నీరు కారిపోయిందో... అక్కయ్యయెడల నాకు గల చనువు, స్వతంత్రం యేదో తెలియని తెరమరుగునపడి పోతున్నట్యానిపించింది! ఇకనించీ దానితో మాట్లాడాలంటే వొక కొత్త మనిషిగానే! కాని తెల్లవారుఝామునే అక్కయ్యా, బావా ప్రయాణమై వెళ్ళడంతో నేను మామూలు ఊబిలో దిగబడిపోయాను.

ఆనాటినించీ నాన్న యెత్తినకత్తికి యెదురులేదు. ఆయన పులిలా తిరుగుతుంటే మేమంతా పిల్లుల్లా నక్కి నక్కి వుండేవాళ్లం. అయినా అమ్మతో యీ మాట యెత్తుతాడేమో వింటామని నాకు మనసులో మెదులుతూ వుండేది; అలాటిదేదీ కూడిరాకపోవడంవల్ల దించుకుపోయాను. మరొక్క ఆశకూడా యేడిపిస్తూ వుండేది. అది బావ అన్నయ్యతో ఏమైనా అన్నాడా అనేది. నిజానికి అన్నయ్యను అడగాలంటే నేను వెనుకాడవలసిన పని లేదు. కాని యెంతో పెద్దవాళ్లని అడగవలసిన దానిని వాడితో అంటే ఆట కోడితనానికి అడిగినట్లుంటుందని జంకాను. వాడికీ, నాకూ మూడేళ్ళు మాత్రమే వార. ఒకటి రెండుసార్లు అడుగుదామని నోటిదాకా వచ్చి మానేశాను. ఒకనాడు పనివేళా పిల్చేసరికి 'యెందుకు?' అన్నాడు వాడు. దగ్గిర కొచ్చేసరికి నాకు గుండె దడదడమన్నది. 'అఁ... ఏవీఁ లేదు. అవ్వాళ బావా నువ్వూ యెక్కడికి వెళ్లారు ఏరు దాటి?' అనడిగాను. వాడు నా మొహంలోకి తేరిచూసి 'నువ్వెంత వెర్రిదానవే!' అన్నట్టు నవ్వి వూరుకున్నాడు. మరేమన్నా నిలదీసి అడుగుతాడేమో అని భయం వేసింది. నేనే లేని నవ్వు తెచ్చుకొని, ఏటివొడ్డున కూర్చుంటే హాయిగానే వుంటుందిరా! అవ్వాళ అక్కయ్యకూడా అన్నది, అని మాట తప్పించుకోనెందుకు తంటాలుపడ్డాను. 'రోజూ వెళ్లేదగా!' అని నిర్లక్ష్యంగా అని తప్పుకున్నాడు వాడు. ఇంక నాకు చెప్పేవాళ్లెవ్వరూ లేరు, ముందు యెలాటి ఫలితం నెత్తిన పడినా, వోర్చుకోడానికి, అనుభవించడానికి సిద్ధమయ్యే వుండాలన్నమాట!

నిమ్మకి నీరెత్తినట్టు బ్రతికే నా గుండెల్లో ప్రతి నిముషమూ యేదో కలవరం బయల్దేరుతూనే వుండేది. బయటికి చెప్పలేక, అణచుకోలేక, అర్థం చేసుకోలేక అణగారిపోయేదానిని. దరీ—అంతూ తోచేది కాదు. లేనిపోని పనులు కల్పించుకొని తీరూ—తెన్నూ లేకుండా ఒకదానికొకటి చేసుకుపోతూవుండేదానిని.

నా పరాకు గమనించి మా అమ్మకూడా హెచ్చరించడం జరిగింది.

మా దొడ్లో నుయ్యి సరిగా తోడిపోతుంటుంది. రోజూ ఇరవై బిందెలన్నా నీళ్లు తోడుతూవుండాలి! ఒకనాడు మధ్యాహ్నం యేదో అవసరమై నూతిలోకి చేదవేశాను. ఉత్తిప్పుడైతే బరువునుబట్టే బొక్కెన మునిగినట్టు తెలుసుకొని లాగగాలి. అప్పుడు పొద్దు సరిగ్గా నెత్తినవుండడంవల్ల నా మొహంకూడా రూపాయంతగా నూతినీళ్లల్లో కదులుతున్నట్లుంది. ఏదో ఆలోచనలో చేదలాగడం మర్చిపోయాను. నావంక నేను దిగాలుగా చూసుకుంటూ నూతిమీదకు వంగాను. ఇంకొక్క నిమిషమైతే కాళ్లు తేలిపోయేవి. వెంటనే అన్నయ్య వచ్చి వెనక్కు లాగాడు. 'కళ్లు తిరిగినయ్యా?' అనడిగింది అమ్మ.

'అవు' నన్నాను. జీలకర్ర వాసనచూడమని యిచ్చింది. తిరిగి నాలుగురోజులవరకూ నేనా పరాకు నుండి కోలుకోలేదు—'అమ్మైనా నాకెందుకు చెప్పకూడదు?' అని వొకనాడు కచ్చతో ఆవిడ మడిలో పెట్టుకున్న నీళ్ళబిందెలు రెండూ తాకి వచ్చాను. తరవాత చెప్పి తిట్లు తిన్నాను—ఇంకొకనాడు నన్ను మడిగట్టుకు వొడియాలు పెట్టమని గుర్బిన పిండి అక్కడపెట్టి యెటో వెళ్ళింది అమ్మ. నాకేదో గుబులుగా పొంగుకు వచ్చింది. మామూలుగా అప్పడాలు వొడియాలు పెడుతున్నారంటే చుట్టపు చూపుగా వొచ్చిన వారంటూ వుండడం విని వున్నాను "అమ్మాయ్ పెళ్లా? అబ్బాయ్ వొడుగా?" అని. సరిగ్గా ఆ సమయానికే మా లక్ష్మివచ్చి నన్ను వేళాకోళం పట్టించడంతో యేవో జ్ఞాపకంవచ్చి కళ్లనిండా నీళ్ళు కమ్ముకున్నయ్. ఎదుట యేమున్నదీ సరిగా కనిపించలేదు. ఎలాగో యీపని కానిచ్చుకుని బయటపడాలని, వొక్కొక్కటి దిబ్బరొట్టెంత పడేసి చెయి కడుక్కోబోయాను నా వెనకనే అమ్మవచ్చి జరిగిన పనికి శాపనార్థాలు పెట్టడం వాటిని మూడు రెట్లుగా సవరించుకోవడం జరిగింది.

పొడిబట్ట కట్టుకుని తలదువ్వి జడవేసుకుందామని అద్దంముందు కూర్చుంటే మళ్ళీ అదే గుబులు. కళ్ళు జేవురించినట్లుండి నాకే భయం గొల్పినయ్. నా మొహం నాకే పరాయిదిగా తోచింది నేను పీల్చి విడిచే ప్రతి ఉచ్ఛ్వాసనిశ్వాసమూ, నాలోవున్న వేదనను రెట్టించినయ్యేగాని ఉపశమింప జేయలేదు. నేనెక్కడకు వెళ్ళినా, ఏమిచేసుకుపోతున్నా, మరేమి ఆలోచించుతున్నా నా చుట్టూ యేదో వలయం అల్లుకుంటున్నట్లనిపించేది. అమ్మ యెంత పిల్చినా, మరెన్ని తిట్టినా వేళ్ళకు అన్నానికి కదిలేదాన్ని కాదు.—నేనిలా ప్రతిపనిలోనూ మొండిచరవడంచూసి వొకనాడు నాన్నకూడా కల్పించుకుని కేకలేయడం జరిగింది. సాధ్యమైనంతవరకు మర్చిపోవాలని, మనసు కుదుటబర్చుకోవాలని నేను చేసిన ప్రయత్నాలంతతొందరగా ఫలితాన్నీయలేదు. గుండెల్లో కుదురుబాటు లేనప్పుడు, దానిని యెంత కప్పెట్టుకోవాలనుకున్నా మొహంలో కనబడక మానదేమో...అంతకంతకూ నా మొహం చూసుకుంటే నాకే డొక్కుపోయినట్లుతోచి, నాన్న తిడతాడేమో అని తప్పుకు తారుకు తిరగడం మొదలెట్టాను.

ఎన్నడూ లేనిది వొకనాడు మధ్యాహ్నం అన్నంతిని నిద్దరకు పడ్డాను. సందెకసువు వూడ్చేవేళకు కూడా లేవకపోయేసరికి, అమ్మ వచ్చి, వీపు మీద తట్టి లేపింది.

'ఏమిటే బండనిద్రా నువ్వూను, ఇంట్లో పనీపాటా చూసుకో అక్కర్లా?' అని కసిరింది, వాకిలి వూడ్చి ముగ్గెయ్యి, నేనిప్పుడే తాయారమ్మగారింటికి వెళ్లివస్తాను; అని నాకొక పని పురమాయించి వెళ్లిపోయింది అమ్మ. నేను లేచి కళ్లు నులుముకుంటూ మంచంనడుంగా కూర్చుని, రేగిన జుట్టు చక్కదోసుకుంటున్నాను. విచ్చి యేచ్చి నిద్రపోవడం, అప్పుడే మెలకువ రావడం మూలాన నాకళ్ళు ఇగురునబడి చింతనిప్పుల్లావుండడం గమనించింది కాబోలు, 'అదేమిటే కళ్ళలావున్నయ్' అని దగ్గరగా వచ్చి అడిగింది అమ్మ.

"పగటినిద్రచేత కావున్ను" అని టూకీగా సమాధానమిచ్చి తప్పించుకో జూశాను. అమ్మ అంతటితో వూరుకొని వళ్ళే ఘటం కాదుగా! "నీ మొహం నిద్ర అంటావేమిటే? కళ్ళు రెండూ నలిపి నైవేద్యం పెట్టే విచ్చినట్టుంటేనూ? పైటచెంగు మాడు! తడిగా వున్నది!" అంటూ కసురుకుంటున్న ధోరణిలో అన్నది. నిజం చెప్పిఒప్పించే తాహతు నాకు లేదు. అమ్మదగ్గర ఆమాత్రం చనువువున్నా, నాన్న చెవిని బడితే అదెలా పరిణమించుతుందోనని మనసులో దేవుతున్నది. అందుకనేగా నా మూగబాధ అంతాను!

ఏమీ చెప్పక మొండిచరిచి వూరుకొన్నాను. తాయారమ్మగారింటికి వెళ్ళడం వాయిదా వేసుకుని నాప్రక్కగా వచ్చి కూర్చున్నది అమ్మ "అక్కయ్య నీతో యేమి చెప్పిందే?" అని ఆవిడ మొదటగా అడిగిన ప్రశ్న. "అక్కయ్య నాకెందుకు చెవుతుందే?"

అని బుంగమూతి పెట్టుకుని మొరటుగా సమాధాన మిచ్చాను.

"నీకు చెప్పకపోతే నాకు చెప్పుతుంది లే? ఏది యేమైనా మీరూ, మీ నాన్నా అందరూ వొకటి. మధ్య అన్నింటికీ నేను నోరు నొక్కుకుచస్తున్నాను. ఏమాట అనబోయినా నీకెందుకు వూరుకోమని కసిరి కొడతారు. అవునుమరి! నేనూ మీఅంతపామేదానైతే బాగానే వుండేదాన్ని. దానిమ్మట్టు కదివొచ్చి వొరగ బెట్టిందేమీ లేకపోగా నాన్నతో కలిసి హోరాహోరి పోట్లాడి పంతం నెగ్గించుకు మరీ వెళ్ళింది! ఎంత కాదన్నా తల్లీతోడూ కనక అన్నాను. ఆమాటా తప్పేనా? దానికింత రాద్ధాంతం చేసుకున్నాగా? వారియిష్టం మీయిష్టమూను. నువ్వు కళ్లు కాయలు కాచేట్టు యేడ్చినా, నేను దిగులుపడి చచ్చినా, జరిగే దేమీ లేదు. మొహం కడుక్కుని, వాకిలూడ్చి ముగ్గెయ్యి!" అంటూ చివాల్న అక్కణ్ణించి లేచి వెళ్లింది అమ్మ.

ఇంక నేను దిగులుపడి లాభంలేదు. మనసు పాడుచేసుకున్నా వొక అందాన కలిసివచ్చేదీ లేదు. గుండెరాయిచేసుకుని ఇంటిపనులు చెయ్యడానికి అక్కణ్ణించి బయటపడ్డాను.

ఇది జరిగిన నాలుగురోజులకే ఒకరాత్రి అమ్మా, నాన్నా యిలా మాట్లాడుకోవడం విన్నాను.

"మీయిష్టం వచ్చినట్టే చేసుకోండి, మధ్య నాతో సలహాలు, సంప్రతింపులూ యెందుకు? నేను చెప్పినవన్నీ చెప్పినట్టు చేసుకుపోయినారు కనకనా?" అంటూంది అమ్మ

"అదికాదే అమ్మాయి పట్టుబట్టి చెప్పి వెళ్ళిన యేలూరుసంబంధానికీయిషం నాకెంతమాత్రమూ యిష్టంలేదు. నలుగురైదుగురు ఆడపిల్లలు, తండ్రి నాకుమల్లేనే యింటికి చేరుకొన్నాడాయె! వారి కందరికీ కార్యకరామత్తులు చేసుకుంటూ యీయన గారి చేతిమీదుగా సంసారం యేం నడుపుతాడు? ముందుముందేం సుఖపడి యేడుస్తారు? ఇప్పటికి యఫ్. ఏ. చదివినంతమాత్రాన యీయనకు ఉద్యోగాలు వొరగబెట్టేవా ళ్లెవరు? సంబంధం చేశామంటే, మొన్నటినించీ మనప్రాణానికి ఉసూరుమనకుండా, వాళ్ళతిండైనా వాళ్ళు తినగలగాలా వద్దా?" అంటున్నాడు నాన్న. "అందుకని యిప్పుడేం జేస్తామంటారు?" అనడిగింది అమ్మ.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. మొన్న బందరు వెళ్లినప్పుడు రామమూర్తి కనిపించి తన తమ్ముడి సంగతి చెప్పాడు. వింటే బాగానే వుండేటట్టు తోచింది. నేనూ కొన్ని షరతులు అడిగాను, తమ్ముడికి వ్రాసి కనుక్కుంటానన్నాడు. అనుకూలిస్తే 'సభం' అని వస్తాను; కాకపోతే యేలూరు కూడా వెళ్ళి సంగతి సందర్భాలు అన్నీ విచారించుకొనే భీమవరం పోతాను. ఈపట్టు యేదో వొకటి ఖాయం అనుకోవాల్సిందే. ఇంకెన్నాళ్లని యెదిగిన పిల్లని యింట్లో అట్టే పెట్టుకుంటాం? ఇంటా బయటాకూడా తల వాచిపోతోంది" అని చాలించాడు నాన్న. ఒక్క నిమిషంవరకూ యెవ్వరూ మాటాడలేదు. అమ్మ యిలా అడిగింది "అయితే మీరిప్పుడు చేయబోయే నిర్వాకం యేమిటి? రామమూర్తి తమ్ముణ్ణి మాటాడటం అదేమంత ఘనకార్యమని? ఎడంచెయ్యి తీసి, పురచెయ్యి వుంచారు. అంతేనా? మీ యిష్టం వొచ్చినట్టే పనులన్నీ చుట్టబెట్టుకురండి! తల్లీ, తోడూ కనక మనసు వూరుకోక అంటూ వుంటాను" అంటూంటే అమ్మ యేడుపు దిగమింగుకొని మాటాడుతున్నట్టు తోచింది నాకు.

"తల్లీ లేదు తోడూ లేదు. అయినవాళ్లంతా— అందులో మీ అన్నలాంటివాడికి పిల్ల నివ్వగానే వొక అందానరాదు. ఆ మొన్నటినించీ యెన్నిపారుపులు పుట్టుకువస్తయ్యో తెలుసా? అయిదుగురు మొగపిల్లలు! పెద్దవాడికీ అమ్మాయికీ రెన్నెళ్ళు వార అంటావ్? వాడికేముందే యేదో పల్లెటూళ్ళో బడిపంతులుగా యేడుస్తున్నాడు బతికలేక! నెత్తిన జుట్టైనా లేదు. రామమూర్తి తమ్ముడంటావా, వాడికి వొక్కడే మొగపిల్లవాడు, వాడికి రెండేళ్లు, ఒక్కర్తే ఆడపిల్ల—దానికి అయిదేళ్లు! ఇద్దరూ పసివాళ్ళే. ఆమాత్రం లేకుండా యెలా వుంటారు? భీమవరంలోనే కాపరం, అక్కడే వుద్యోగం కూడా. ఎంత లేదన్నా బస్తీ కాపరం గదా! అమ్మాయి అన్నివిధాలా సుఖపడుతుందనే నా వుద్దేశ్యమూను" అని వూరుకున్నాడు నాన్న. వొక్రమానికి అమ్మ అడిగింది, "అమ్మాయితో చెప్పారా?" అని.

"ఆఁ...దానికీ దీనికీ చెబుతూ కూర్చుంటే పనులు సాగుతియ్యా?" అన్నాడు నాన్న. "మీ యిష్టం వొచ్చినట్టు చేసుకోండి!" అన్నది అమ్మ. "తెల్లవారుఝామునే బయల్దేరిపోయి మొదటి కారు అందుకోవాలి. బందరు కోర్టులో పని చూసుకుని,

"రామమూర్తితో మాట్లాడి భీమవరం పోయివస్తాను" అని మాట చాలించాడు నాన్న.

నాన్న యెన్నడూ యింతసేపు అమ్మతో మాట్లాడగా చూడలేదు! ఇప్పుడు నా విషయమై సంప్రదించడానికి ఆయన కింత తీరికా, వోర్పూ వొచ్చినయ్యనుకుంటాను!

కాని, నే నిన్నాళ్ళనించీ దేనికోసం మథనపడి, ఆవేదనపడి చస్తున్నానో అది యీ రాత్రితో తేలిపోయిందన్నమాట! దానితోపాటే నా భవిష్యత్తు కూడా ముడిపడి ఉన్నది కనక, ఇంక సందేహింపనవసరం లేదు; తల్చుకుంటే నాన్న అంతపనీ చేసే తీరతాడు! ఈ క్షణంనించే నేను ఒకయింటి కోడల్నయిపోయానని తీర్మానించుకోవచ్చు!

ఇంక నేను కుమిలి చావడమెందుకు? అక్కయ్య యేదో చెప్పకుండా వెళ్ళిందని దానిని అనుకొని లాభమేమిటి? ఇంతపని చేయదల్చుకున్న నాన్న రేపు బందరు వెళ్ళినప్పుడు దానితో మాత్రం చెప్పి వొప్పించడూ? మా అక్కచెల్లెళ్ళల్లో అది తలూపితే యింక నోరెత్తేవాళ్ళే వుండరుగదా! ఆ క్షణంలో నా గుండె వొక రాయో, పాషాణమో అయిపోయింది. రేపట్నించీ నేను మామూలు మనిషిని కాదు; యిద్దరు బిడ్డలకు తల్లిలాటిదాన్ని కాబోతున్నాను, చేతినిండుగా పని! ఇంట్లో యెంతసందడి! — అయితే మీకొక సందేహం కలగవచ్చు, మామయ్య కివ్వడానికి ససేమిరా వొప్పుకోని నాన్న, అలాటిదే అయిన మరో సంబంధానికి నన్నెలా కట్టబెట్టాడూ! అని.

మానవుడు బుద్ధిపూర్వకంగా యేది వద్దనుకుంటాడో, తిరిగి తెలిసో, తెలియకో తాత్కాలికమైన కొన్ని బలహీనతలవల్ల, దానికే వొడబడుతూ వుంటాడు. అదే మా నాన్న మనస్తత్వంలో వున్న గొప్పదనం!

నేనూ యీ ప్రశ్నే అడుగుతానని కాబోలు, మా అమ్మకూడా నాకీ విషయంగురించి చెప్పనేలేదు. ఇంక నేను ఆలోచించదల్చలేదు, చాటున యేడవాలనుకోలేదు. ఆరాత్రి మామూలుగా నే నిద్రపట్టింది!

వారం రోజులకల్లా భీమవరం సంబంధమే ఖాయం చేసుకుని తాంబూలాలు పుచ్చుకొని వచ్చాడు నాన్న. నాకు వేరే బొట్టుపెట్టి చెప్పకుండానే సంగతంతా తెలిసింది. మా అమ్మ పెళ్ళిపనులు మొదలెట్టింది. చిత్రమేమిటంటే, నా పెళ్ళికి చిన్నక్కయ్యకూడా వొప్పుకుందట! నాలుగురోజులు ముందుగానే వస్తానన్నదట!! కార్యక్రమంయే కొదవా లేకుండా సాగిపోతూనే వున్నది, మిగతా మా అక్కయ్యలకు, బంధువులకు శుభలేఖలు వ్రాశాడు నాన్న. వారితోపాటు మామయ్యకూ వొకటి వ్రాశాడు. కట్నాలూ, కానుకల విషయం తేలికగానే పరిష్కారమైపోయిందట. ఈయన యివ్వవలసినది ఆట్టే లేదు, వెండిచెంబులు, పట్టుబట్టలు మాత్రమే. వారికి వొక్కర్తే ఆడపడుచు, తోచినంత లాంఛనం మాత్రం యివ్వాలి! వారు మాత్రం యెనిమిది వందలు నగల క్రింద నాకిచ్చేటట్టు వొప్పుకున్నారట! మరి వారెవ్వరూ నన్ను చూడడానికి గానే లేదు...ఒకనాటి ఉదయాన వాకిలికి పచ్చతోరణం కట్టాడు నాన్న. చిన్నక్కయ్య నన్ను పెళ్ళికూతుర్ని చేసింది. సాయంత్రానికల్లా భీమవరంవారు సపరివారంగా దిగారు. మా యింటి యెదురుగావున్న బాబాయిగారింట్లోనే వారికి విడిది యేర్పాటయింది. వారందరికీ కాఫీ ఫలహారాలు అందివ్వడంలో హడావిడిగా తిరుగుతున్నారు, మా అక్కయ్యలు ముగ్గురూ. ఆనాడే మా చిన్నబావమాత్రం వచ్చాడు. నేను బయటపడే పనులేవీ చేయకపోయినా యింట్లో వుండి యేవో అటూ-యిటూ సర్దుతున్నాను అప్పుడు గదిలో పట్టెమంచం క్రింద నాన్న తెచ్చిన కూరలన్నీ విడివిడిగా పేరుస్తున్నాను. మా చిన్నబావ గుమ్మందగ్గరకొచ్చి నిలబడి "లక్ష్మీ!" అని పిల్చాడు. చివాల్న లేచి యివతలకు వచ్చాను. "ఏం కోపంగా వున్నావ్?" అని అడిగాడాయన. "అబ్బే, ఏమీ లేదు బావా!" అన్నాను, లేనినవ్వు తెచ్చిపెట్టుకుంటూ. "పెళ్ళివారొచ్చారు చూశావా?" అనడిగాడు బావ. "వాళ్ళు బాబాయిగారింట్లో దిగారుగా, అయినా నీ కెప్పుడూ పరాచికాలే బావా!" అన్నాను. "రేపట్నించీ బస్తీకి వెళ్ళిపోతే మేము జ్ఞాపకం వుంటామా?" అన్నాడాయన.

"నువ్వూ అక్కయ్యా మాత్రం తప్పకుండా జ్ఞాపకం వుంటారు బావా!" అన్నాను. నేనామాట మామూలు ధోరణిలో సాదాగా, ముక్తసరిగా అని వుంటే ఇప్పుడు వ్రాయవలసివుండేదే కాదు. నేనెంతో కచ్చగా పళ్ళు బిగించి బాణం విసిరినట్టు అన్నానని తరవాతగాని గ్రహించుకోలేదు. మరాయన మనసుకు ఏమని తోచిందో, దెబ్బతిన్నవాడులా గుమ్మానికి చేరగిలబడి మరి నోరెత్తకుండా వెళ్ళిపోయాడు — బహుశా వొకటి అనుకొని వుంటాడు. తనూ, అక్కయ్యా కలిసి యేదో పెద్ద ద్రోహం చేసినట్టు నేను తలచానని, ఆ బాధనే మాటలో పొదిగి,

యిలా తనమీదకు విసిరివుంటానని—అప్పట్నించీ ఆయన నాతో మాట్లాడాలంటే మొహం చెల్లనట్టు తప్పించుకు తిరుగుతూ వుండేవాడు. అజ్ఞానం వల్ల అనవసరంగా ఆయన మనసును బాధ పెట్టానేమో...అని నేను పరితపించిపోయాను. దానిలో యీ వున్న కాస్త ఉత్సాహం కూడా లేకుండాపోయింది. ఆ క్షణంనుంచీ నే నేది చేసినా యంత్రంలాగే చేసుకుపోయాను.

కొంత సేపటికి మా ఆడబిడ్డ నన్ను చూడడానికి వచ్చింది...ఆవిడ అడిగిందల్లా రెండే ప్రశ్నలు - వంటా పెట్టు, చేతనవునా? చదవను వ్రాయను వచ్చునా? అని. చెప్పాను: కాదూ, నా పనులన్ని యంత్రంలాగే వున్నయ్యని. ఆవిడకిచ్చిన సమాధానాలుకూడా అలాగే వున్నయ్యని తరవాత తెలిసింది! ఆవిడ గడపదాటిందో లేదో! అక్కయ్య రివ్వున వచ్చి నన్ను కసిరి కొట్టింది. "ఏవిటా పెంకె సమాధానాలూ నువ్వూను" అని. "నే నేమన్నా నేమిటి?" అని దానిని రెట్టించి అడిగాను. "అడిగినప్పుడు సరిగా చెప్పొద్దూ? వంట చేతవునా అంటే, ఎందుకు చేత కాదూ? అని ఆవిణ్ణే యెదురుప్రశ్న వేయడమా?" అన్నది. "నే నేం అలా అనలేదు" అని అక్కయ్యను యెదిరించబోయాను. వెంటనే నాన్న వచ్చి "ఏవిటీ గందరగోళం. అవతల పెద్దమనుషులతో పని" అని కసిరి కొట్టడంతో యెక్కడివాళ్ళక్కడ సర్దుకున్నారు—రాత్రికి భోజనాల తంతు సాదాగానే సాగిపోతోంది. బావ యెందులోనైనా పాల్గొంటున్నాడా, లేక నాలాగే తనూ బాధపడుతున్నాడా? అని ఏక్షణాని కాక్షణం కనిపెట్టి చూస్తూ నేవున్నాను. పెళ్ళివారి వరసనే ఆయనకూ పీట వేశారు. ఆవేళకు వచ్చింది ఆయనవొక్కడే—మిగతా యిద్దరు బావలూ లగ్నం వేళకు దిగారు. ఎంతో సేపటివరకూ ఆయన భోజనం పందిట్లోకి రానేలేదు. అంతా సిద్ధమౌతోంది. నేతి ఝారీపట్టుకుని నాన్న ఇటూఅటూ తిరుగుతున్నాడు. అక్కయ్యలు వడ్డనలు చేస్తున్నారు. 'మీ ఆయన యేడమ్మా!' అని చిన్నక్కయ్యను అడిగాడు నాన్న. వస్తార్లేనాన్నా, అని తాపీగా సమాధానమిచ్చింది అక్కయ్య. చిట్టచివరకు లడ్డూల పళ్లెం చేతబట్టుకు వచ్చి అందరినీ నవ్వించాడు బావ. కిటికీదగ్గరకు వచ్చేసరికి నా మొహంలోకి పరకాయించిచూసి అదోలా ముడుచుకుపోయాడు. నేనూ చివాల్న అక్కణ్ణించి యివతలకు దూకాను. ఇంతలోనే సన్నాయి మేళం మోగింది. పెళ్లివారు ఒకొక్కరే పట్టుబట్టల పటాటోపంతో పీటలమీదకు చేరుకుంటున్నారు. చిట్టచివరకు రామమూర్తిగారూ తమ్ముడూ దిగారు వారివెంట అన్నయ్య వస్తున్నాడు. వారిద్దరిలో కాస్త పెద్దగా పీలగా వున్నవారు అన్నగారని, కొంచెం పొట్టిగా వున్నవారు తమ్ములని నాకు నేనే పోల్చుకున్నాను. నా వూహ సిసలైనదే—అన్నగారూ ఆయనా యేవో మాట్లాడుకుంటున్నారు. మనిషిలో ఔద్ధత్యం కనబడలేదు గాని, ఆయన మొహంలో యేదో విచారరేఖ వొకటిమాత్రం అస్పష్టంగా వున్నట్టు ఆ దీపాల వెలుగులో అనిపించింది నాకు. అది బహుశా, పూర్వస్మృతుల చిహ్నమేమో...అక్కయ్య వచ్చి అప్పడాలూ—వడియాలూ వెయ్యడంతో వడ్డన పూర్తయింది. ఇలాంటి సమయంలో అత్తయ్య వుంటే యెన్ని అధ్యాత్మ రామాయణ కీర్తనలు పాడివుండేదో...ఏదో చాటున వుండి 'శృంగార లహరి' పాడుతున్నది చిన్నక్కయ్య. మా అందరిలో సంగీతం చెప్పించింది దానికొక్కర్తెకే.

అందరూ ఆపోశనం పట్టబోతుండగా మా మామయ్య పెద్దకొడుకు శాస్త్రి దిగాడు. వాళ్ల తరఫున వచ్చిందల్లా వాడొక్కడే. చూసీ చూడడంతోటే అన్నయ్య వెళ్ళి వాణ్ణి కౌగలించుకున్నాడు. 'మామయ్య వస్తున్నాడా?' అని అడిగాడు. 'అందరి బదులూ నేనే వచ్చాను' అన్నాడు వాడు యుక్త సరిగా. వొదినగా రెక్కడ? అంటూ గుమ్మంలోకి చక్కా వచ్చాడు. వాడిని చూడగానే యెక్కడలేని యేడుపూ గుబులుగా పొంగివచ్చింది నాకు. రెండు చేతులతో మొహం కప్పెట్టుకుని పక్కకు తప్పుకున్నాను.

ఆమొన్నాటి ఉదయానే బాజా బజంత్రీలు మ్రోగినై, సరిగ్గా పదిగంటల యిరవైయైదు నిమిషాల కల్లా రాఘవరావుగారు నా మెళ్ళో మంగళ సూత్రం బంధించారు. అంతటితో శాస్త్రీయంగా పెళ్ళి అయిందన్నమాటేగా! ఆ సమయంలో యెందుకనో ఆయనకు చేతులు వణికినయ్. మంగళసూత్రం జారి నా వొడిలో పడింది. నాకు వెన్ను ఝల్లుమన్నది. నావెనకనే వున్న అక్కయ్యలు ఒకరి మొహంవంక ఒకరు చూసుకున్నారు. ఎదురుగుండా వున్న చిన్నబావ అదోకలా తల తిప్పేసుకున్నాడు. అమ్మా, నాన్నా కూడా కొంచెం గాబరా పడ్డట్టు కనిపించారు. అమ్మలక్కల్లో పెద్ద కలకలం బయల్దేరింది. ఆయన యెలాగో తమాయించుకుని,

తిరిగి మూడు ముళ్ళూ వేశారు—తలంబ్రాలు పోయడంలో కూడా ఆయన అంత ఉత్సాహం చూపలేదు.

కట్నాలవేళకు అందరూ తలా వొకటీ చేతబట్టుకొని వచ్చారు. చిన్నబావ యేం చదివించుతాడా అని నా ఆదుర్దా—

చిన్నక్కయ్య వెండి కుంకంభరిణె చదివించింది......ఉన్నట్లుండి మా యిద్దరికీ చెరివొక ఖద్దరు నూలుదండా యిచ్చి అందరినీ నవ్వించాడు బావ. ఆయనగారి మెడలో నేనా దండవెయ్యాలన్న మాట! నాకు చేతులు వణికినయ్. అంతమనిషి యెదట నేనెంత! అనిపించింది. అయినా తప్పని సరి. ఆయన నా మెడలో వేశారు. నా సాహసాన్ని పరీక్షించడానికే బావ యింతపని చేశాడా, అనిపించింది. చిన్నక్కయ్య వచ్చి నా చేతులు పట్టుకుని ఆయన మెడలో దండ వేయించింది. హోమాలనించి మామయ్యగారి శాస్త్రి మరో రెండు కర్పూరం దండలు తెచ్చాడు. ఈసారి నేనొక్కర్తెనే వెయ్యాలని కాబోలు, అక్కయ్య నా సరసకు రాలేదు! ఈ దంపతు లిరువురూ, పార్వతీ పరమేశ్వరుల అన్యోన్యం కలిగి, చిరకాలం వర్ధిల్లాలని పెద్దలంతా స్వస్తివాచకాలు, సామగానాలు చదివి మా నెత్తిన అక్షింతలు చల్లారు.—తండ్రిగారి కల్యాణం చూడకూడదనే నిషేధం వుందట! రాఘవరావుగారి సంతానాన్ని అస లిక్కడకు తీసుకురానేలేదు.—మధ్యాహ్నం భోజనాలవేళ వేరేకంచంలోనే వడ్డించారు నాకు—సాయంత్రం పూలదండల వేళకు అమ్మలక్కల్లో తలపట్లు బయలుదేరినయ్—

“ఇంకా చెండ్లాట యేమిటి? ఆయనమాత్రం యెలా వస్తాడు, బాలాకుమారుడిలాగ?” అని యీసడించింది మా పెద్దక్కయ్య. “అయితే అమ్మాయ్ ముచ్చట యెలా తీరుతుంది” అని దాని పంతం నెగ్గించుకోవాలని పట్టుపట్టింది మూడో అక్కయ్య. దీనిని ఆధారంగా గొని ఇంట్లో, పెద్ద రణగొణ ధ్వనులు బయలుదేరినై. చిన్నక్కయ్య బావా మాట్లాడుకొని వొక నిర్ణయానికివచ్చినట్టున్నారు. అది వచ్చి అందరితోనూ యేదో చెప్పింది. కొంత సద్దుమణిగింది. మొత్తంమీద ఆపూటకు ఆ ప్రమేయం విరమించబడింది. నామట్టుకు నేను బ్రతుకుజీవుడా, అనుకున్నాను—

ఆ మొన్నాడు పెళ్లివారందరూ వెళ్ళిపోతారు గనక భోజనాలైనతరవాత, పెట్టేబేడా సద్దుకోవడం మొదలెట్టారు. మరి నేనూ వారిలో వొకదాన్నయాను కనక, నా ప్రయాణానికి తగిన సన్నాహాలుకూడా జరుగుతున్నయ్, చిట్టచివరకు నావెంట యెవరు వెళ్ళాలి? అనే మీమాంస బయల్దేరింది. “ఇంటిదగ్గిర పిల్లలు వొక్కళ్ళూ వున్నారు, నేను వెళ్లటానికి లేదు” అన్నది పెద్దక్కయ్య. “మా ఆయన మద్రాసు వెడుతున్నారు, ఆయనకు అన్నీ సర్దియివ్వాలి, ఎక్కడ యేమున్నదో కూడా తెలియదాయనకు, నేను బెజవాడ వెళ్లిపోవాలి” అన్నది మూడో అక్కయ్య. “అయితే నేనేనా యే పనీ పాటా లేనిదానిని? ఒక్కనాడుకూడా మా ఆయన అత్తెసరు పెట్టుకు తినలేదు. హోటలు భోజనం అసలే ఆయనకు సరిపడదు” అన్నది చిన్నక్కయ్య. “అందరూ అలా గనుకుంటే నేనేం జెయ్యను తల్లీ? ఈ కొంప యెవరిమీద వదిలిపోయేదీ?” అన్నది అమ్మ. అన్నింటికీ సాహసికురాలు, అయినమట్టుకు నిర్వహించుకు రాగల్గినదీ, మా చిన్నక్కయ్యే కనక చివరకు నాతో రావడానికి తనేవొప్పుకుంది. దాని చెవిలో యేమిటో రహస్యంగా మాట్లాడింది అమ్మ. నేను భీమవరం వెళ్ళాక నాకు ఎలాటి సలహాలివ్వాలో చెప్పివుంటుందనుకున్నాను.

అనుకున్న వేళకు ప్రయాణం సాగింది. అందరం భీమవరం చేరుకొన్నాం. ఆపూటే గృహప్రవేశం తంతుకూడా నడిచిపోయింది. గడపదాటి మేమిద్దరం లోనికి వెళ్లాలంటే పరస్పరం పేరులు ప్రకటించుకొని ద్వారలక్ష్మిని అనుమతి కోరాలట! ఇది వొక ప్రమాదకరమైన పట్టుదలగా పరిణమించింది నా విషయంలో. చుట్టూ వున్నవాళ్లందరూ చెవులు రిక్కించి మా నోటివెంట వచ్చే చిన్న మాటకోసం నిరీక్షిస్తున్నారు! ఎక్కడికో కానిదేశం తీసుకువచ్చి నన్నీ ఆడపులుల మధ్య బంధించారా, అనిపించింది. కట్టూ-బొట్టూ యెలాగున్నా వారిమాట, మన స్తత్వం నాకు మరీ కొత్తవిగా తోచినయ్. ఇంత స్వల్పవిషయాలకింత పట్టుదలలు యెందుకూ అనిపించింది. అందరినీ సమాధానపర్చుకు రాగలిగింది మా అక్కయ్య. ఇంక నా దగ్గిరకొచ్చి, నిదానించి లాభంలేదు, నువ్వే ముందు చెప్పాలి, లేకపోతే మనల్ని వేళాకోళం పట్టిస్తారు, అని చెవులో చెప్పినట్టుగా చెప్పింది. భయంలేదన్నట్టు వీపుపై చెయివేసి నిమిరింది. నేనూ అంతటి సాహసానికీ సమకట్టాను. రాఘవరావుగారూ, నేనూ వచ్చాము, తలుపుతియ్యమని, అజ్ఞాతదేవతను ప్రార్థించాను. నిజానికి ఆసమయంలో నాగొంతు ప్రార్థనాస్వరంలోనే పలికినట్టు గుర్తు! నాకు వొళ్లు గగుర్పొడి

చింది. విజయగర్వంతో తలెత్తి చూశాను, రావుగారి మొహం దగిరలో స్పష్టంగానే కనిపించింది. వారెందుకో తటపటాయిస్తున్నట్టు కనబడ్డారు. వెంటనే అనిపించింది పూర్వంలాగే, 'ఇంతటి వారియెదట నేను నిలబడగలనా?' అని నేనీ తబ్బిబ్బులలో వుండగానే ఆయనా, నా పేరు చెప్పినట్టున్నారు. అందరూ ఘొల్లుమని పెద్ద కోలాహలం చేశారు. ఎందుకో, మా తాలూకు మానాభిమానాలతో వారికింత చెలగాటం? అడుగు ముందుకు వేయబోతూ వుండగా, వొకను తైగువ నా యెదురుగా వచ్చి కళ్లు పెద్దవిచేసి యిలా అన్నది. 'మాయింట్లో పెళ్లికూతురు మూడుమార్లు చెప్పే అలవాటుంది కనుక మామూలు చెల్లించి మరీ కదులు...' అని. రావుగారు చిరాగ్గా ఆమెవంక జూసి పళ్లు బిగించారు. ఆవిడ వెనక్కు జారుకుంది. నేను వారినించి బైటపడ్డానన్నమాట! ఇంక మూడు రాత్రులు ఇక్కడ గడపాలన్నమాట!

సాధ్యమైనంతవరకూ, నన్ను అంటిపెట్టుకు తిరుగుతూ వున్నది అక్కయ్య. అయినా అది అవతలకువెళ్లిన ఘడియలోనే నన్నొక సమస్య యెదుర్కొంది.—సబ్బుబిళ్ల చేతబట్టుకుని నీళ్లు పోసుకోబోయింది అక్కయ్య. ఆ సాయంత్రం రావుగారి యిద్దరిపిల్లల్ని తీసుకుని మా ఆడబిడ్డ నేనున్న గదిలోకి వచ్చింది. పరాకుగా ఆలోచిస్తున్న నేను చివాల్న లేచి నిల్చున్నాను.

“ఫరవాలేదమ్మా, కూర్చో...అంటూ నాదగ్గరకువచ్చి ఆ బిడ్డలకు నన్ను పరిచయం చేయబోయింది. పెద్దపిల్లకు అయిదేళ్లు. “యీవిడ మీపిన్ని, పో! దగ్గరకువెళ్లు; అమ్మకాదు? నిన్నెత్తుకుంటుంది గా” అని దానిని ముందుకు నెట్టింది. అది నా మొహంలోకి దీక్షగాచూసి ముందడుగు వేయడానికి తటపటాయిస్తూ నిల్చున్నది. ఇంక పిల్లవాడికి రెండేళ్లుమాత్రమే! వాడు బొటనవ్రేలు చీకుతూ అత్తయ్య పక్కగా వొదిగి వున్నాడు. “అమ్మరా నాన్నా! మీ అమ్మ!! వెళ్లు! ఎత్తుకుంటుంది వెళ్లు!!” అని రెండు చేతులా వాడిని నా కీయబోయింది. వాడు నోట్లో వ్రేలు తీసి ఇదెవరు? అన్నట్టు మొహంబిగించి నావంక కొండంత అనుమానంతో చూశాడు. అవును మరి! ఆ పసి మనసుల్లో యేమేమి స్మృతులు బాధిస్తున్నవో...

నిజానికి యెనిమిది నెల్ల క్రిందటివరకూ, వాళ్లు అమ్మ వొడిలో దోబూచులాడుకొన్న వాళ్లేగా, ఇంతిలో మర్చిపోగలిగి వుంటారా? అమ్మ యిచ్చిన చనుబాలతీపి వారి కంత తేలికగా మరుపుకొస్తుందా? మరి, వాడలా వెర్రిగా చూడడంలో అర్థమేమిటి? అమ్మ, అనే పవిత్రనామానికి నేను అర్హురాలను కాదా? సహజంగా మాతృహృదయంలో నిండివుండే ప్రేమ, నా కళ్లల్లో వాళ్ళకు కనుపించడం లేదా? నేనిలా మథనపడుతూన్న తరుణంలోనే “రారా నాన్నా! అమ్మగా! అని ఆ మాటలే పునశ్చరణ చేసుకొంటూ వాడిని నా చంకకిచ్చింది వదినగారు. యేడ్చాడు. నేను లేని నవ్వు తెచ్చిపెట్టుకుని వాడిని యెగరేసి ముద్దుపెట్టుకున్నాను. “వెళ్ళమ్మా! పిన్ని దగ్గరకువెళ్లు! అని పెద్దపిల్లను కూడా అక్కడే దిగవిడిచి, చరాల్న బాణంలా దూసుకుపోయిందావిడ. నాకిదే పరీక్షా? అనుకొన్నాను. రామూని యెత్తుకుని, సరోజను చేతబట్టుకొని గుమ్మందాకా నడిచాను. అమ్మ, అన్నది సరోజిని. ఎక్కడ, అనడిగాను 'అదుగో, అని గోడమీదవున్న ఫొటో కేసి చూపించింది. నాకు వెన్ను ఝల్లుమన్నట్టయింది. మా అక్కయ్య, పేరుకు తగినట్టుగానే శాంతంగా చిరునవ్వుతో నా వంకకు చూస్తున్నట్టయింది. 'పిల్లలు జాగ్రత్త' అని యేదో తెలియని మూగభాషలో హెచ్చరిస్తున్నట్టుంది. రామూను మరొకసారి అక్కున జేర్చుకుని ముద్దుపెట్టుకున్నాను. 'అమ్మా' అంటూ వచ్చీ రాని తొక్కుపలుకులతో మెడ కావిలించుకున్నాడు వాడు. పిన్నీ, నన్నూ యెత్తుకోవూ? అని చీరకొంగు లాగింది సరోజ. నేనొక్కర్తెనే వొకరికి పిన్నీ, మరొకరికి అమ్మానా? నాలుగడుగులు ముందుకు వెళ్ళి అటుకేసి తలెత్తిచూశాను. ఇదంతా తిలకిస్తూ వున్నట్టు రావుగారు కనుపించారు. దిగ్గున వెనక్కు తగ్గాను. వినుకున్నారో మరి! మధ్యాహ్నానికల్లా అక్కయ్య ఫొటో అక్కడలేదు.—

అక్కడ వున్న మూడురోజులూ నాకా పిల్లలతోనే కాలం గడిచింది. రాత్రులు నా దగ్గరే పడుకుంటానని మారాం చేసింది సరోజ. నేనూ అందుకు కాదనలేదు. హృదయం యిచ్చే యెవ్వరికైనా పిల్లల అమాయికపు మనసులు వశమౌతాయేమో...

ఈ స్వల్పవ్యవధిలోనే పసిపిల్లల్ని సాకే తీరుతెన్నులు కొన్ని నాకు చెప్పింది మా అక్కయ్య— 'వారు మారాంచేసి యేడ్చినా వోర్చుకోమన్నది. అంతగా పోరుపెట్టి పట్టినపట్టు విడవకపోతే, ఏదో కథ చెప్పి వూరుకోబెట్టమన్నది. అమ్మను జ్ఞాపకం చేసే విషయాలేవీ వాళ్ళ స్మృతికి రానీయవద్దన్నది. ఆటబొమ్మలు కొనిపించి పేరు పేరునా కథలుగా విప్పిచెప్పమన్నది. ఆయనగారు విసుగ్గా చిరాగ్గా

వున్నప్పుడు, పిల్లల్ని ఆ చాయలకు పోనీయవద్దన్నది. నీదగ్గిరే పడుకుంటానని మారాం చేస్తే, వొక చిన్న మంచంమీద వాళ్లను పెట్టుకు పడుకొని నిద్దరూపమన్నది: తెల్లవార్లూ ఆ బిడ్డల పక్కలోనే పడుకోవడం మరవవద్దన్నది. 'అమ్మ', అనే మాట వారి నోటివెంట వచ్చినప్పుడు ఆమాటకు నేనే అర్థమైనట్టు సర్వవిధాలా వారిని వొప్పించడానికే పాటుపడుకోమన్నది. సాధ్యమైనంతవరకూ తండ్రితో పాటే రెండుపూటలా వారికి అన్నం పెట్టమన్నది. ఇంక నా విషయంలో...కొన్నాళ్ళవరకూ ఆయనతో పాటు భోజనానికి కూర్చోవద్దన్నది. ఆయన తిన్న విస్తర్లో తినాలనే మూఢవిశ్వాసం మానుకోమన్నది. భోజనం చేసి లేవగానే ఆయనకు వక్కపలుకు ఇచ్చే అలవాటు చేసుకొంటే మంచిదన్నది. ఆఫీసునించి యింటికి వచ్చే వేళకు పిలల్ని ఆడించుతూ, విసుగులేకుండా నవ్వు మొహంతో కనబడమన్నది. లేనిపోని గొంతెమ్మకోరికలు కోరి ఆయనకు చిరాకు కలిగించవద్దన్నది. చివరకు ఒక్కమాట మర్చిపోవద్దన్నది. మా అక్కయ్యగారి ఫొటో యెదురుగా నిల్చుని వొంటరిగా యెన్నడూ ఆలోచించవద్దు, అని—అక్కయ్య చెప్పిన యీ వుపదేశాల బరువుతోనే మూడురాత్రులు గడిచాక భీమవరం నించి మా వూరు చేరుకొన్నాం—

భావికాలంలో నేనవలంబించబోయే మాతృత్వాన్ని మననం చేసుకోవడంతోనే పదిహేను రోజులు గడిపాను. నా మట్టుకు నేనే యేవో కొన్ని నిర్ణయాలు కూడా చేసుకున్నాను. కొన్నింటిలో నాకు కొంత అసంతృప్తి వుండవచ్చు, కాని దానిని పైకుబికి రానీయక లోపలనే అణచుకుని కార్యాచరణకు సిద్ధమయ్యే ప్రయత్నంలోనే వున్నాను—

భీమవరంనించి రావుగారు నాన్నకొక ఉత్తరం వ్రాశారు, 'తను వొంటరిగాడినని, పిల్లలను సాకుకుంటూ ఆఫీసుకు వెళ్ళి రావటం యాతనగా వున్నదని, వెంటనే వొక మంచిరోజు నిర్ణయించి, ఆ మొక్కు కాస్తా తీర్చితే నన్ను తీసుకువెళ్లితానని"—ఆవుత్తరం నాన్న చెయిదాటి నాకళ్లబడింది. ఆయన బుద్ధిపూర్వకంగానే నాకు అందజేశాడనుకుంటాను. రావుగారు వ్రాసిన ప్రార్థనాపూర్వకమైన వాక్యాలు చూడడంతోనే నాకూ కళ్ళల్లో నీళ్లు తిరిగినయ్—నేనెంత అమాయకపు, అవ్యక్తపు ప్రాణినైనా, వారి యెదుట నిలబడడానికే తాహతులేనట్లు జంకుతున్నా, నన్నే ఆసరాగా జూసుకుని రాబోవు జీవితంలో వారేదో సుఖపడాలని, తన తరఫున ఇంట్లో బాధ్యత వహించగల వ్యక్తి వొకటి కలదనే తృప్తి పొందాలని, ముఖ్యంగా తన బిడ్డలకు ఆలనా పాలనా లభించగలదని, ఇంకా యేవేవో తీయని తలపులతో మనసు నింపుకొన్నారుగదా!" అనిపించింది. వారి వూహలన్నీ,కల్పనలన్నీ నిజాలని నిరూపింపవలసిన కర్తవ్య భారం యిప్పుడు నామీద పడిందన్నమాట! సహజంగా లోకంలో వారందరూ యిలాగే తలంచుకుంటూ వుంటారా? ఒక వ్యక్తికి మరొక వ్యక్తి గృహజీవనంలో ఆసరాగా వుండకపోతే జీవితంలో వెలుగు అనేదే వుండదా? ఇంతటి పవిత్రమైన పత్నీత్వము, మాతృత్వము, అనే రెండు ఉత్తమ ధర్మాలు నాకిచ్చి నిర్వర్తించుకోమంటున్నారా రావుగారు? అందుకై నేనెందుకు సంసిద్ధురాలను కాకూడదు? తప్పకుండా నడుంబిగించుకొనేవున్నాను. మరి నాన్న వారికేమని సమాధానం వ్రాయబోతున్నాడో...

నేను ఏనాడో వారిదాననయ్యాను. ఇంకొక్క క్షణమైనా యిక్కడవుండగల తాహతు నాకు లేదు. రెక్కలుకట్టుకు యెగిరిపోదామన్నంత ఉత్సాహపు పొంగు నాలో పెల్లుబికివచ్చింది. నాన్నకూడా దగ్గరలో ముహూర్తం నిర్ణయించి రావుగారికి ఉత్తరం వ్రాశాడు. ఆనాటికే చిన్నక్కను రమ్మని బందరు వొక ఉత్తరం వ్రాశాడు—

అనుకొన్న రోజుకల్లా రావుగారు దిగారు. వెంట యెవ్వరూ లేకుండా ఆయన వొక్కరే వచ్చారు. జరగవలసిందంతా ముక్తసరిగానే గడచిపోయింది—వారికీ, నాకూగల సన్నిహితత్వం నిరూపించుకోవాల్సిన సమయం దగ్గిరపడుతున్నకొలదీ, నా మనసు అదోకలా గుండడం మొదలెట్టింది. మొత్తంమీద మందమతిగా వుండకుండానే తోచిన పనులేవో చక్కబెట్టుకుపోతున్నాను.—పెద్దలు నిర్ణయించిన ముహూర్తం దగ్గిర పడడానికి అట్టే వ్యవధిలేదు. కావలసిన యేర్పాట్లన్నీ అక్కయ్య చేసుకుపోతున్నది. ఆయన నాకై ప్రత్యేకంగా తెచ్చిన జరీ అంచు తెల్లచీర సింగారించింది. మొహాన బొట్టు పెట్టి, గది గుమ్మంవరకు తీసుకువెళ్లి లాలించి లోపలకు పంపింది.—

రావుగారు మంచంమీద కూర్చొని యేదో పత్రిక చదవడంలో నిమగ్నులై వున్నట్టున్నారు. వెంటనే తలెత్తి నావంక చూడలేదు. ఆయన గ్లాస్గో పంచె కట్టుకుని సన్నని సిల్కులాల్చీ తొడుక్కున్నారు. భయంభయంగానే నేను వారివంక చూశాను. రెండు చేతులూ వెనక్కు పెట్టుకుని గోడకు చేరగిలబడి గుమ్మానికి ప్రక్కగా నిల్చున్నాను. ఎదురుగుండా

గోడన వున్న కోదండరాముని రూపచిత్రం నా మనసును ఆకర్షించింది. సీతామహాతల్లి ఆయన అంకంపైన యెంత నాజూకుగా, ఒనువుగా కూర్చొని వున్నది! జీవితంలో స్త్రీ కోరేది, కోరవలసింది కూడా పతి దగ్గిర తన కలాటి పవిత్రమైన ఆశ్రయం కావాలనేనా? తదేకంగా నే నటు చూడడం గ్రహించి, పత్రిక చదవడం ముగించి, నా మొహంలోకి పరకాయించి చూసినట్టున్నారు, రావుగారు. కొన్ని క్షణాలైన తరవాతగాని నేనా విషయం గ్రహించుకోలేకపోయాను. నా రక్కణ్ణించి లేవడానికే ప్రయత్నిస్తున్నట్టు అలికిడియై నాధ్యానానికి భంగంకలిగించింది. మరుక్షణమే 'లక్ష్మీ' అనే పిలుపు వారి పెదవులనుండి వెలువడింది. ఆ పిలుపుతో పాటే వారి పాదాలుకూడా నా వేపుకే కదులుతూన్నట్టు గ్రహించాను. మరొక కనురెప్పపాటులో నే వారి చేతులు సున్నితంగా నా పూలజెడను తడిమినై.

నే నంతకుముందే వూహించుకొన్నట్టు, తాను తలచినవీ, కల్పించుకొన్నవీ అన్నీ వ్యక్తంచేశారాయన. భావిజీవితం నిరామయంగా, నిరుపహతంగా గడచిపోవాలనే వారి వాంఛితం కొనసాగాలంటే అందుకు నాపై పెట్టుకొన్న ఆశలన్నీ వ్యక్తం చేసేటప్పుడు వారి కనుకొలకుల్లోనించి నీళ్ళు రాలటం నా కళ్ళారా చూశాను. పైటచెంగుతో అద్దే సాహసంలేక కాసేపు గజబిజి అయినాను.

వారి యెదుట నిలబడగల తాహతు, నాకు కలదనే ధీమా క్షణక్షణానికీ బలపడింది. క్రమంగా యిద్దరి హృదయాలూ సన్నిహితాలై, ఒక తీరానికి చేరుకొన్న సంతృప్తిని వెల్లడించి పరస్పరం పలకరించుకొన్నయ్.

హృదయాలు ఏకమై, పరస్పరం పరిపుష్టమైన చైతన్యాన్ని నింపుకొన్నప్పుడు జీవితం వొడుదుడుకులు లేకుండా సాగిపోవడానికి, వయోభేదం అంతగా ఆటంకం కాదేమో...అని రెండవనాటి రాత్రి వూహించుకొన్నాను——ఆశలు, ఆశయాలు ఒకటైనప్పుడు, లౌకికములైన కొన్ని అసంతృప్తులను, వాటిని పురస్కరించుకొని ఉత్పన్నములైన ఆవేశాలను అణచుకొని అవాంతరాలను అధిగమించిపోయే అవకాశం లేకపోలేదని మూడవనాడు తోచింది నాకు——ఆ తరువాతి రోజునే రావుగారితోపాటు నేనూ భీమవరం ప్రయాణమయ్యాను. ఈ తడవ కూడా అక్కయ్యే నాతో వచ్చింది——నే నక్కడున్న మూడురోజులూ, మొదట నా మనసులో గల్గిన వూహాలన్నీ మరింత బలపడినయ్. అందుకై నేనూ కొంత ప్రయత్నించుకొన్నాను——తిరిగి అక్కయ్యా నేనూ యింటికి చేరుకొన్నాం.

కొన్నాళ్ళకు ఒక మంచిరోజున నన్ను తీసుకువెళ్ళి భీమవరంలో దిగవిడిచి వచ్చాడు నాన్న. నేనూ మామూలు సంసారిణినే అయ్యాను.

అక్కయ్య ఆనాడు చెప్పిన మాటలన్నీ అక్షరాలా పాటించడానికే పాటుబడ్డాను. పిలల విషయంలో నే నెంతమాత్రమూ యేమరి వుండేదానిని కాదు. రావుగారు కూడా నా వైఖరియెడ సంతృప్తిగానే వుండేవారు. అప్పుడప్పుడూ యేవేవో చిన్న చిన్న విషయాలపై నాతో సంప్రదించుతూనే వుండేవారు. మనసుకి కష్టంకలిగే మాట అనేవారే కాదు, ఒకవేళ నోరు జారినా నొచ్చుకున్నట్టుండేవారు. నేను నోరు చేసుకుని అడిగినా, అడగకపోయినా తనకు నచ్చిన ఏవో కొన్ని చీరలు, జాకెటు గుడ్డలు తీసుకువచ్చి నా సమ్మతిని అర్థించేవారు. అది కేవలం నన్ను తనవైపుకి ఆకర్షించుకొనే ఆరాటం మాత్రం కాదు; యధార్థంగా వారి మనసే అంత. అని త్వరలో నే గ్రహించుకొన్నాను. ఆఫీసునించి వచ్చేటప్పుడు, ఏదో వొకటి చేతబట్టుకు వచ్చి నాకిచ్చేవారు. పిల్లలు కాళ్ళకు అడ్డాలుపడి, తమకు ముందు పెట్టమని పెంపర్లాడితే 'అమ్మ పెడుతుంది అడగమని' నన్ను చూపెట్టేవారు. ఆ మాట విన్నప్పుడు, ఒకప్పుడు సిగ్గుతో ముడుచుకొనిపోయేదానిని; మరొకప్పుడు అంతులేని ఆనందంతో పొంగిపోయేదానిని. నా కళ్ళు అప్రయత్నంగా నే గోడన వ్రేలాడుతున్న శాంతక్కయ్య ఫొటోవైపుకి చూసేవి.

మా యింట్లో ఉదయం, మధ్యాహ్నం కూడా కాఫీలు త్రాగే అలవాటుండేది. అందరం వొక్కసారే త్రాగేవాళ్ళం. పిల్లల్ని త్రాగించడంలో ఆయన కూడా యెక్కువ శ్రద్ధ తీసుకుంటూ వుండేవారు. సరోజకు ఒక చెమ్చా పంచదార యెక్కువ పడితేగాని కాఫీ నోట బెట్టేదికాదు. దానికి పానకాలస్వామి అని నేను పెట్టిన పేరు విని వారు ముసిముసి నవ్వులు నవ్వేవారు. ఒకనాడు యేదో పనితొందరలో వుండి భోజనం కాగానే వక్కపలు కీయడం మర్చిపోయాను. కాఫీకి వచ్చినప్పుడు ఆ సంగతి జ్ఞాపకం చేస్తే "దాని బదులుకూడా యిప్పుడే ఇవ్వు" అన్నా రాయన. ఆ మాటతో నా హృదయం తేలికయింది.

అంట్లూ చెంబులు తోమడానికి, ఇల్లు వూడవడానికి పనికత్తె వుండనే వుండేది. ఎటొచ్చీ మిగతా వంటపనులు మాత్రమే నేను చేసుకోవాల్సినది. వెళ్లిన

కొత్తలో యేదో మాటవరసని అన్నారు. "వంట మనిషిని పెడదా మనుకుంటున్నాను" అని. అందుకు నేనే అడ్డుపడ్డాను. "నేనెంత చిన్నదాన్నయినా ఆమాత్రం చేసిపెట్టలేనా యేమిటి?" అని ఆయనవంక కొంటెగా చూశాను. వెంటనే యిలా అనేశాను. "వంటకుకూడా మనిషిని పెట్టుకోడానికి మన మేమంత భాగ్యవంతులమని?" అని; నా మొదటి మాటలో వారికి సున్నితమైన యెత్తిపొడుపు గోచరించిందనుకొన్నా, ఈ సంసారం చక్కదిద్దడానికే నేనిక్కడకు వచ్చానన్న సంతృప్తి నా రెండవ మాటవల్ల ఆయన పొందారని వెంటనే గ్రహించుకొన్నాను. అంతేకాక నా రెండవమాట విని యీ యింటి పెద్దరికాన్ని నాకు అంటగట్టాలని కాబోలు, గోడన వున్న అక్కయ్య ఫోటోవంక చూసి దిగ్గున అక్కణ్ణించి లేచివెళ్ళారు.—

సాధారణంగా ఆయన భోజనంచేసి ఆఫీసుకు వెళ్ళిన తరవాతనే, నేను అన్నానికి కూర్చుంటూ వుండేదానిని. పిల్లలు నాప్రక్కనే కూర్చొని ఆడుకొంటూవుండేవాళ్ళు. ఓనాడు ఆయనకు మజ్జిగ వడ్డించి, గదిలోకి వచ్చి ఇస్త్రీ పంచా వుత్తరీయం వొంకెకు తగిలించి చొక్కాకు గుండీలు పెడుతున్నాను. ఆయన చెయి కడుక్కుని సరాసరి అక్కడకు వచ్చారు. చొక్కా చేతికిచ్చి వక్కపలుకు తీసియీయబోయాను. నా మొహంలోకి పరకాయించి చూసి ఆయన యెందుకనో విషాదంగా నవ్వుకున్నారు. ఆఫీసునించి రోజూకంటే గంట ముందుగా యింటికి వచ్చేశారు—ఈలోగా నాకొక ఆలోచన తోచింది. నేను మాటిమాటికీ, అడుగడుగునా సన్నిహితురాలను కావాలనుకొన్నకొలదీ, ఆయన మొహంలో అప్పుడప్పుడూ విచారరేఖలు చూస్తున్నాను. మధ్యాహ్నం అలా యెందుకు నవ్వుకోవాలి? నా ప్రవర్తనలవలన వారికేవైనా పూర్వపు స్మృతులు జ్ఞాపకానికి వస్తున్నవా? లేక ఆయనకింత దగ్గరగా వుండడంలో నా పొరపాటేమైనా వున్నదా?" అన్నంతవరకూ నా ఆలోచనలు పరుగెత్తినయ్. ఇట్టే వచ్చేయడం చూసి "అప్పుడే తిరిగి వచ్చారా?" అన్నట్టు ఆయనవంక జూశాను. సరాసరి గదిలోకి వెళ్ళి పడుకున్నారు. మంచినీళ్ళగ్లాసు చేతికందిస్తూ వుండగా, "లక్ష్మీ; ఇలా కూర్చో!" అన్నా రాయన. పిల్లలు సావిట్లో ఆడుకొంటున్నారు. గ్లాసు అందుకుని క్రిందపెట్టి మంచంకోటికి ఆనుకొని నిల్చున్నాను. "లక్ష్మీ, ఇలా చూడు! నావంక చూడు!" అన్నారుమళ్ళీ. మరింత దగ్గరగా ఒరిగాను. వారిచేతులు నా చెక్కిళ్ళపై నిమురుతున్నయ్, లాలనగా. ఆయన ఇలా చెప్పుకుపోతున్నారు. "శాంత చచ్చిపోతూ వొక్క బెంగపెట్టుకున్నది, ఈ యింట్లో యెవ్వతై అడుగు పెడుతుందో, నా బిడ్డల్ని యెలా చూస్తుందో...మిమ్మల్ని యెలా సాకుతుందో..." అని. అప్పట్లో నేనేమీ సమాధానం చెప్పలేకపోయాను. నా ముప్ఫైరెండేండ్ల జీవితం యెలా వెళ్ళమారుతుందా అనుకొన్నాను. బందర్నుంచి అన్నయ్య ఉత్తరం వ్రాశాడు. అంగీకరించుతున్నట్లు సమాధాన మిచ్చాను. కాని, తరవాత తటపటాయించక పోలేదు. అయినా తప్పని సరి! పిల్లల మొహం చూసే నేనిందుకు వొప్పుకున్నాను. ఇదంతా గుబులుగా జ్ఞాపకానికివచ్చి, ఆనాడు మంగళసూత్రం నీ వోళ్లో జారవిడిచాను.—నువ్విక్కడికి వచ్చిందగ్గిర్నుంచీ వాళ్లునిన్ను 'అమ్మా' అని పిలవడం నాకెంతో పరవశం కలిగించింది. నిజంగా నువ్వు శాంతనే మరిపించావన్నమాట! మధ్యాహ్నం నువు చొక్కా చేతికిచ్చి వక్కపలుకు చేతికిచ్చినప్పుడు అచ్చంగా నాకీ ఆలోచనతోనే కళ్లల్లో నీళ్ళుతిరిగినయ్. ఎలాగో ఆఫీసుకు వెళ్ళాను. నా మనసంతా యిక్కడే వున్నది. పని సాగలేదు. ఈ సంగతి నీతో చెప్పకుండా వుండలేకపోయాను. ఆఫీసరు దగ్గిర పర్మిషన్ అడిగి యిక్కడకు వచ్చిపడ్డాను. లక్ష్మీ, నీ హృదయం యెంత విశాలమైనది! నిన్ను కన్నతల్లి యెంతటి ధన్యురాలో కదా! నేనిక గుండెలమీద చేయి వేసుకుని జీవితం నెరపగలను. నువ్వెంత ఉత్తమా ఇల్లాలివి!"

అంటూ ఆప్యాయంగా, ఆశగా నా మొహంలోకి చూశా రాయన. నా వేళ్లు నాలుగూ తలలోదూర్చి అరిచేత్తో ఆయన వెచ్చటి నుదుటిపై అదిమాను. కొన్ని క్షణాలు అలా నిశ్శబ్దంగా గడిచినయ్. వారి దగ్గిర్నుంచి నే నాశించింది ఇంతేనా? నా సాధన సఫలమయ్యిందా? నిరంతరం నే నిలాటి ఆనందమయ క్షణాలనే చవిచూడగలనా?" అన్న తీయని తలపులతో నా హృదయం నిండి బరువెక్కింది.

నా జీవితాకాశంలో ఒక పొద్దు పొడిచినట్టు ఉదయలక్ష్మి కెంజాయి తళుకులు వారి కళ్ళల్లో మిలమిల లాడినట్లున్నయ్, నే నిలాటి మధురమయ భావనలో మునిగివుండగా సావిట్లోనించి 'అమ్మా' అని పిల్చాడు రాము. నేను వెళ్ళి వాడిని అక్కున జేర్చుకువచ్చాను. ఆయన తన్మయత్వంలో అలాగే నావంక జూస్తూ వుండిపోయారు.